


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 97, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 12, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## జూబ్లీహిల్స్ చెక్ "పోస్ట్"

### కాంగ్రెస్ జోరుకు కారు బ్రేకులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్ర సమితి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మగంటి సునీతను అభ్యర్థిగా నిలబెట్టాలని దాదాపుగా నిర్ణయించింది. ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, పార్టీ ఇప్పటికే సునీతను చురుకుగా ప్రచారం చేయమని కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇతర సీనియర్ నేతలతో కలిసి సునీత పార్టీ కార్యకర్తల సమావేశాల్లో, బుధవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో జరిగిన సమావేశంలో వేదిక పంచుకోవంతో ఈ ప్రచారం నిజమేనని భావించాల్సి వస్తుంది. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. దీంతో ఆయన కుటుంబంలోని వారికే టిక్కెట్ కేటాయించాలని బీఆర్ఎస్ దాదాపుగా నిర్ణయించింది.

**ప్రజలతో మాగంటి కుటుంబానికి..**

సెంటిమెంట్ తో పాటు మాగంటి గోపీనాథ్ కు నియోజకవర్గం ప్రజలతో ఉన్న అనుబంధంతో మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెడితే ఖచ్చితంగా గెలుస్తామన్న అభిప్రాయంలో గులాబీ పార్టీ నేతలున్నారు. ముఖ్యంగా మహిళ ఓటర్లతో పాటు ఒక సామాజికవర్గం ఓట్లు కూడా మాగంటి సునీతకు గంపగుత్తగా వచ్చి పడతాయని ఆశిస్తుంది. అదే సమయంలో తెలుగుదేశం పార్టీకి సానుభూతి పరుల ఓట్లు కూడా మాగంటి సునీత సొంతం చేసుకుంటారని నమ్మకంతో ఆమెను జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో నిలబెట్టేందుకు దాదాపుగా సిద్ధమయినట్లు తెలిసింది. పార్టీలో నమ్మకంగా ఉండటంతో పాటు మాగంటి కుటుంబానికి టిక్కెట్ ఇచ్చి న్యాయం చేసినట్లు చెప్పుకోవడానికి కూడా కారు పార్టీ నేతలకు ఇది ఉప కరిస్తుంది.

**సానుభూతి పవనాలు..**

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి వంటి సీనియర్ నేతలు టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, గోపీనాథ్ కుటుంబ సభ్యునికే పార్టీ అవకాశం ఇవ్వాలని దాదాపుగా నిర్ణయించింది. మాగంటి గోపీనాథ్ మూడుసార్లు జూబ్లీహిల్స్ నుంచి విజయం సాధించారు. నియోజకవర్గంలోని ప్రజలతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. మాగంటి గోపీనాథ్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఆయన మరణంతో కలిగిన సానుభూతి కూడా కలిసి వస్తుందని బీఆర్ఎస్ భావిస్తుంది. ఇలాంటి వ్యూహం పార్టీకి కొత్తది కాదు. 2024 జూన్‌లో సికింద్రాబాద్ కాంటోన్మెంట్ బోర్డు ఉప ఎన్నికల్లో, మాజీ ఎమ్మెల్యే జి. సాయన్న కుమార్తె లాస్య నందిత మృతి చెందిన తరువాత, మరో కుమార్తె నివేదితను బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టింది. ఆ పోటీలో పార్టీ కాంగ్రెస్

2లో..

## మారిషస్‌తో మాది రక్త సంబంధం

### దౌత్య సంబంధాలపై మోదీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రామ్‌గూలం గురువారం వారణాసిలో ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగానే మోదీ మాట్లాడుతూ భారత్, మారిషస్ కేవలం భాగస్వాములు మాత్రమే కాదుని ఒకే కుటుంబం లాంటివారని అభివర్ణించారు. రెండు దేశాలు భౌగోళికంగా వేరైనా వాటి కలలు, భవిష్యత్తు ఒక్కటేనని అన్నారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉన్న మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించారు. మారిషస్‌కు ఒక ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని మోదీ ప్రకటించారు. ఇది మౌలిక సదుపాయాలు, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ రంగాలను బలోపేతం చేస్తుందని

2లో..

## రెండేళ్లలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేస్తాం

### జలవనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి అనేది తలెత్తకూడదని అన్ని కాలాల్లోనూ జల వనరులు సమృద్ధిగా లభించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక ఏడాది వర్షాలు సరిగ్గా లేకపోయినా, ఎగువ రాష్ట్రాల నుంచి వరద జలాలు రాకున్నా ఎలాంటి ఇబ్బంది రాకుండా నీటి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ప్రస్తుత జలాశయాల నిల్వలు, నీటి నిర్వహణ, ప్రాజెక్టుల పురోగతి, భూగర్భజలాలు తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ

2లో..

## ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకం

### - కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో కూటమి సర్కార్ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా పాలనా వ్యవస్థలో చేస్తున్న మార్పులు, చేర్పులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే సచివాలయం స్థాయిలో పలువురు ఐఏఎస్ లను, ఉన్నతాధికారుల్ని బదిలీ చేసిన ప్రభుత్వం, గురువారం జిల్లా కలెక్టర్లను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. ఇందులో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు కూడా కలెక్టర్లుగా అవకాశం దక్కింది. జరిగిన బదిలీల్లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ గా

2లో..

## ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టుకు రైల్వే లైన్

### రైల్వే అధికారులతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను వివరించారు. అదే విధంగా రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను వివరించారు. శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ కోసం కొత్తగా రైల్వే కనెక్టివిటీ అంశాన్నీ పరిశీలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్ తో పోలిస్తే కొత్త లైన్ తో దూరం కూడా తగ్గుతుంది. వీటన్నింటి పై నిర్దిష్ట ప్రణాళికలతో, కేంద్రంతో సమన్వయంతో ముందుకు వెళ్దామని సూచించారు. పెండింగ్ లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం

2లో..

## హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం

### - మునిగిన విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సెప్టెంబరు రెండో వారం వచ్చినప్పటికీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను వర్షాలు వదలడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిహెచ్ఎంసి పరిధిలో వర్షం దంచి కొట్టింది. మధ్యాహ్నం నుంచి హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో సుమారు రెండు గంటలుగా వర్షం కురుస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో

2లో..

## అదొక మ్యాచ్ మాత్రమే

### - భారత్, పాక్ మ్యాచ్ రద్దు పిటిషన్ పై సుప్రీం ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఈ నెల 14 న భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ జరగకుండా అడ్డుకోవాలని, రద్దు చేయాలని ఆదేశాలివ్వాలని సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఊర్వశి జైన్ అనే న్యాయ విద్యార్థిని మరో ముగ్గురితో కలిసి ఈ పిల్ దాఖలు చేసింది. మ్యాచ్ ఆదివారం జరగనున్న నేపథ్యంలో

2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### కీలక నేత సహా 10 మంది మావోయిస్టుల మృతి



**రాయపూర్ (ప్రశ్న న్యూస్)** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. సుక్మ జిల్లా గరియాబాద్ లో పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు జరిగిన ఎన్ కౌంటర్ లో పది మంది మావోయిస్టు లు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మనోజ్ కూడా అలియాస్ మొడెం బాలకృష్ణ తో పాటు ఒరిస్సా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ పాండు మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోంది. 10 మంది మావోయిస్టులను భద్రతా దళాలు

2లో..

## వారిని తక్షణమే ఇళ్ల నుంచి ఖాళీ చేయించండి

### వర్షాల తీవ్రత, సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** గత పది రోజుల క్రితం తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత కాస్త విరామం ఇచ్చిన వరుణుడు, మళ్లీ విరుచుకుపడుతున్నాడు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నగరంపై కుండపోత వర్షం పడటంతో సాధారణ జీవనం పూర్తిగా దెబ్బతింది. ఎల్బీనగర్, హయత్‌నగర్, వనస్థలిపురం వంటి ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు చెరువులను తలపించగా, ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. అధికారులు, పోలీసులు వెంటనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి రక్షణ చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన

2లో..

## రాహుల్ గాంధీ గీత దాటుతున్నారు

### - ఖర్గేకు లేఖ రాసిన సీఆర్పీఎఫ్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తన విదేశీ పర్యటనల సందర్భంగా భద్రతా నిబంధనలను తరచూ ఉల్లంఘిస్తున్నారని, ఇది

2లో..

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

### - ఇండియా కూటమిలో ప్రకంపనలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు విపక్ష ఇండియా కూటమిలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్డీఏ అభ్యర్థికి ఊహించిన

2లో..

## నేపాల్ ఆందోళనల్లో కొత్త మలుపు

### ప్రధాని అభ్యర్థిపై నిరసనకారుల మధ్య ఘర్షణ



**ఖాట్మండు (ప్రశ్న న్యూస్)** నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధంతో మొదలైన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఇప్పుడు కొత్త మలుపు తిరిగాయి. దేశాన్ని కుదిపేస్తున్న ఈ నిరసనల్లో ఇప్పుడు నిరసనకారుల మధ్యే విభేదాలు భగ్గుమన్నాయి. తాత్కాలిక ప్రధాని అభ్యర్థి ఎవరనే దానిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో గురువారం ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఖాట్మండులోని

2లో..

# జూబ్లీహిల్స్ చెక్ "పోస్ట్"

అభ్యర్థి చేతిలో ఓడిపోయినప్పటికీ, దివంగత నేతల కుటుంబ సభ్యులకు టిక్కెట్ ఇచ్చే విధానాన్ని బీఆర్ఎస్ కొనసాగిస్తుంది. ఈ వ్యూహంతో కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టడానికి వీలవుతుందని కారు పార్టీ నేతలు గట్టిగా నమ్ముతున్నారు.

# మారిషస్‌తో మాది రక్త సంబంధం

తెలిపారు. "మారిషస్ అభివృద్ధిలో నమ్మకమైన భాగస్వామిగా ఉండటం భారత్‌కు గర్వకారణం. ఈ ప్యాకేజీ కేవలం సహాయం కాదు. మన ఉమ్మడి భవిష్యత్తులో ఒక పెట్టుబడి" అని మోదీ అన్నారు. ఈ ప్యాకేజీలో భాగంగానే మారిషస్లో 500 పడకల ఆసుపత్రి, వెటర్నరీ స్కూల్ నిర్మాణానికి భారత్ మద్దతు ఇవ్వబోతుంది. అంతేకాకుండా మారిషస్‌లో భారత్ వెలుపల మొదటి 'జన్ ఔషధి కేంద్రం' కూడా ఏర్పాటు అయిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

### భారత్, మారిషస్‌లు ఒకే కుటుంబం..

అలాగే తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసికి మారిషస్ నాయకుడిని ఆహ్వానించడం తనకు గర్వకారణమని మోదీ అన్నారు. "శతాబ్దాలుగా కాశీ భారతదేశ నాగరికత, సంస్కృతికి ప్రతీకగా ఉంది. మన సంప్రదాయాలు, విలువలు శతాబ్దాల క్రితం మారిషస్‌కు చేరి అక్కడి జీవన విధానంలో లోతుగా పాతుకుపోయాయి. అందుకే నేను సగర్వంగా చెబుతున్నాను. భారత్ మరియు మారిషస్ కేవలం భాగస్వాములు కాదు ఒక కుటుంబం" అని మోదీ పునరుద్ఘాటించారు.

### మారిషస్ విశ్వవిద్యాలయంతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని..

ఐఐటీ మద్రాస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ కూడా మారిషస్ విశ్వవిద్యాలయంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, ఇది పరిశోధన, విద్య, ఆవిష్కరణలలో పరస్పర భాగస్వామ్యాన్ని కొత్త స్థాయికి తీసుకువెళ్తుందని ప్రధాని ప్రకటించారు. అలాగే మారిషస్ నాయకుడిని చాగోస్ ఒప్పందం ముగింపు సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. దీన్ని మారిషస్ సార్వభౌమాధికారానికి "చారిత్రక విజయం"గా పేర్కొన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ మారిషస్‌కు అండగా నిలిచిందని చెప్పారు. స్థానిక కరెన్సీలో వాణిజ్యాన్ని ప్రారంభించడానికి కృషి చేస్తామని, మారిషస్ యొక్క సముద్ర భద్రతను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఈ సమావేశం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేసేలా ఉందని ఆయన పేర్కొన్నారు.

# ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టుకు రైల్వే లైన్

పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్ మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు.

కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు.భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు.

దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు.

వికారాబాద్– కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల–డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ తో పాటు వరంగల్ ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

# ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకం

ప్రభాకర్ రెడ్డి, విజయనగరం జిల్లా కలెక్టర్ గా రామసుందర్ రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గా కీర్తి చేకూరి, గుంటూరు కలెక్టర్ గా తమీమ్ అన్సారియా, పల్నాడు కలెక్టర్ గా కృతిగా శుక్లా, బాపట్ల కలెక్టర్ గా వినోద్ కుమార్, ప్రకాశం కలెక్టర్ గా రాజా బాబు అవకాశం దక్కించుకున్నారు. అలాగే నెల్లూరు జిల్లా కలెక్టర్ గా హిమాన్షు శుక్లా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా నిషాంత్ కుమార్, కర్నూలు కలెక్టర్ గా డాక్టర్ ఎ. సిరి, అనంతపురం జిల్లా కలెక్టర్ గా ఓ.ఆనంద్, సత్య సాయి జిల్లా కలెక్టర్ గా శ్యాంప్రసాద్ ను నియమించారు.మరోవైపు కొత్తగా నియమించిన జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకమని, తన ఆలోచనలు, అంచనాలు అందుకోవాలని, బెస్ట్ పెర్ఫామెన్స్ ఇవ్వాలన కోరారు. సిఎం అంటే కామన్ మ్యాన్ అని తెలిపారు. మీరూ అదే పాటించండన్నారు. అన్నింటికీ రూల్స్ కాదు, మానవీయ కోణంలో పనిచేయాలని సూచించారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్ అని, రియల్ టైంలో వాటిపై స్పందించాలని ఆదేశించారు. ఈసారి కలెక్టర్లకు పోస్టింగ్ ల విషయంలో మరింత గట్టి కసరత్తు నిర్వహించానని చంద్రబాబు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదన్నారు. దీనికి కారణం ఉందన్నారు. అనేక సమస్యల మధ్య ఏడాది క్రితం పాలన ప్రారంభించామని, ప్రజలు తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. వాటిని తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వీటిని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే కలెక్టర్లే కీలకమన్నారు. మీ పనితీరే ప్రభుత్వానికి విజయాలను తెచ్చి పెడుతుందన్నారు.నాలుగో సారి ముఖ్యమంత్రిగా ఉన్న తన టీం మీరేనన్నారరు. పనిచేస్తే ప్రోత్సహిస్తానన్నారు. ఆశించిన ఫలితాలు రాకపోతే మాత్రం క్యారీ చెయ్యనన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పిన దాంట్లో మంచి చెడు చూడాలని, ప్రజలకు ఉపయోగపడేది అయితే మానవీయ కోణంలో పనిచేయాలన్నారు. తాను తప్పు చేయమని చెప్పనని, పొలిటికల్ గవర్నెన్స్ అంటే తప్పు చేయమని కాదని, కలిసి పనిచేయమని అన్నారు. ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇవ్వాలన్నారు. పొలిటికల్ గవర్నెన్స్ చేసిన సమయంలో తాను ఓడిపోలేదని, ఎక్కువ బ్యూరో క్రటిక్ గవర్నెన్స్ చేసినప్పుడే రాజకీయంగా నష్టపోయానన్నారు.

## రెండేళ్లలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేస్తాం

అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు.గతేడాది ఇదే సమయంతో పోల్చుకుంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువగానమోదైందని అయినప్పటికీ ఎక్కడా నీటి సమస్య ఉత్పన్నం కానివ్వలేదని సీఎం అన్నారు.ఇది కేవలం సమర్ధ నీటి నిర్వహణతోనే సాధ్యమైందని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

### ప్రస్తుతం 1,031 టీఎంసీల నీటి నిల్వలు

రాష్ట్రంలో మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లో మొత్తం 1,313 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు వీలుండగా ఇప్పటివరకు 1,031 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలియజేశారు. రాష్ట్రంలోని భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో 79 శాతం నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ మొదటివారానికే ఈ స్థాయికి నిండాయని వివరించారు. ఇందులో శ్రీశైలం సహా మేజర్ ప్రాజెక్టుల్లో 89 శాతం మేర, మీడియం జలాశయాలు 57 శాతం, మైనర్ ప్రాజెక్టుల్లో 39 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. సోమశిల, కండలేరు, బ్రహ్మంసాగర్ నింపే విషయంలో సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### 38,457 చెరువులు నింపేలా చర్యలు

రాష్ట్రంలో 38,457 చెరువులకు గాను 32,642 చెరువులను ఇంకా పూర్తిగా నింపాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వివరించారు.హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని 497 చెరువులకు గాను 51 చెరువులు పూర్తిగా నిండాయని వివరించారు. అన్ని చెరువులు వీలైనంత త్వరగా నింపగలిగితే హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని 89,117 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే రూ.6,518 కోట్ల వ్యయమయ్యే ప్రాధాన్య ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.దీనిద్వారా 2,81,139 ఎకరాలకు కొత్తగా సాగునీరు ఇవ్వడంతో పాటు, 3,38,326 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం సాధ్యపడుతుందన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, బొడ్డేపల్లి రాజగోపాల రావు వంశధార ప్రాజెక్ట్, సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్, తారకరామ తీర్థ సాగరం రిజర్వాయర్ ప్రాజెక్ట్, గాలేరు నగరి సుజల స్రవంతి పనుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. గాలేరు నగరి సుజల స్రవంతి 108 కి.మీ. మేర పూర్తి చేసి కడప వరకు నీటిని తీసుకువెళ్లేలా, పనులు నిలిచిన చోట్ల మళ్లీ టెండర్లు పిలిచి యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. రూ.1,686 కోట్లతో చేపట్టిన శ్రీశైలం డ్యామ్ రక్షణ పనులు, ఎస్కేప్ చానల్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు.

### ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ. 2 వేల కోట్లు

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయండి. ఇందుకోసం ఈ ఏడాది వెయ్యి కోట్లు, వచ్చే ఏడాది మరో వెయ్యి కోట్లు ఇస్తాం. అటు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ఇటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా రెండు వైపులా పంపులతో విశాఖ నగరానికి ఈ ప్రాజెక్టులు విస్తరించాలి.'అని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.'వంశధార, నాగావళి, చంపావతి అనుసంధానం చేస్తూ ఈ ప్రాంతంలోని అన్ని రిజర్వాయర్లు నింపడం ద్వారా ఉత్తరాంధ్రలో వాటర్ నెట్వర్క్ ఏర్పాటు చేయాలి. ఇది ఉత్తరాంధ్ర నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. ఏలేరు పూర్తిగా నింపాలి. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని తరలించడానికి ఏలేరు ఎంతో కీలకం.' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### ముందుగా వరికపూడిసెల ఫేజ్ 1 పనులు

హెడ్ వర్క్స్ మినహా వరికపూడిసెల ఫేజ్ 1లో మిగిలిన అన్ని పనులు పూర్తి చేసి 24,900 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిచ్చేందుకు సిద్ధం చేయాలని సీఎం అధికారులకు చెప్పారు. అలాగే ఫేజ్ 2 పనులకు సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చే ఏడాది జనవరి నాటికల్లా సాధించాలని ఆదేశించారు. రెండు దశలు పూర్తి చేయడానికి రూ.1,925 కోట్లు వ్యయం కానుండగా, 84,281 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. గతేడాదికన్నా ఈ ఏడాది రాష్ట్రంలో 1.25 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి సగటు భూగర్భజలాలు 8.43 మీటర్లుగా ఉన్నాయి. భూగర్భజలాలు 8 మీటర్ల కంటే దిగవకు ఉన్న 7,762 గ్రామాల్లో వాటి పెంపునకు ఫామ్ పాండ్స్, చెక్ డ్యామ్‌ల నిర్మాణం వంటి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అలాగే భూగర్భ జలాల సమాచారం రియల్ టైమ్‌లో స్పష్టంగా తెలుసుకునేందుకు వచ్చే 3 నెలల్లో కొత్త సెన్సర్ల ఏర్పాటు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం

అనేక కాలనీలు జలమయమయ్యాయి.

### హైదరాబాద్‌లో అనేక ప్రాంతాలలో భారీ వర్షం

హైదరాబాద్లో చినుకు పడితేనే నగర రహదారులన్నీ చిత్తడిగా మారుతాయి. అటువంటిది కుండపోతగా వర్షం కురిస్తే అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్ నగర్ తో పాటు అబ్దుల్లాపూర్మెట్ తదితర ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో 10.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

### మునిగిపోయిన జాతీయ రహదారి

హైదరాబాద్లో, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్ పేట, ఎస్సార్ నగర్, మియాపూర్, కొండాపూర్ ప్రాంతాలలో కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఇదిలా ఉంటే భారీ వర్షం కారణంగా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు జాతీయ రహదారి వరదనీటితో మునిగిపోయింది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ కు ఇబ్బంది ఏర్పడింది. దీంతో వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడ్డారు.

### విజయవాడ హైదరాబాద్ నేషనల్ హైవే పైన నిలిచిన ట్రాఫిక్

మరోవైపు భారీ వర్షంతో విజయవాడ హైదరాబాద్ నేషనల్ హైవే పైన ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారి పైన మోకాళ్ళ లోతు నీళ్లు ప్రవహిస్తూ ఉండటంతో హయత్ నగర్ నుంచి సిటీ వైపు వెళ్లే వాహనాలు భారీ వరద నీటి కారణంగా నిలిచిపోయాయి. ఇక వాహనదారులకు ఇబ్బంది నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ను నియంత్రించడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు.

### హైదరాబాద్‌లో నాలుగు రోజులు వర్షాలు

ఇదిలా ఉంటే ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల నాలుగు రోజులపాటు హైదరాబాద్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈనెల 14వ తేదీ వరకు హైదరాబాదులో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గురు, శుక్రవారాలలో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిన్న కూడా హైదరాబాద్లో అనేక ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నగర వాసులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

దానికంటే 14 ఓట్లు అదనంగా లభించడంతో కూటమి ఐక్యతపై మరోసారి సందేహాలు మొదలయ్యాయి. ఈ పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, ఇండియా కూటమి తరపున బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు మాత్రమే లభించాయి. వాస్తవానికి ఎన్డీఏకు ఉన్న సంఖ్యాబలం కంటే 14 ఓట్లు ఎక్కువగా పోలవ్వడంతో విపక్షాల శిబిరంలో క్రాస్ ఓటింగ్ జరిగిందని స్పష్టమైంది. ఈ ఫలితాలు ఇండియా కూటమిలోని పార్టీల మధ్య తీవ్ర అపనమ్మకాన్ని సృష్టించాయి.ఈ పరిణామాలపై ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పందించారు.

క్రాస్ ఓటింగ్ గురించి తాను ప్రత్యేకంగా మాట్లాడబోనని, జరిగిందంతా దేశ ప్రజలు గమనించారని ఆయన వ్యాఖ్యానించారు. పదవుల కోసం పార్టీల్లో చేరాల్సిన అవసరం తనకు లేదని ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. పోలింగ్‌లో కొన్ని ఓట్లు చెల్లుబాటు కాకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని ఆయన అన్నారు. మరోవైపు ఈ క్రాస్ ఓటింగ్ వ్యవహారం ఇండియా కూటమిలో అంతర్గత ఆరోపణలకు దారితీసింది. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఒకరిపై ఒకరు అనుమానాలు వ్యక్తం చేసుకుంటున్నాయి. ఆర్జేడీ, జేఎంఎం, శివసేన (యూబీటీ) పార్టీలకు చెందిన కొందరు ఎంపీలు కూడా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి ఉండవచ్చని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇదే సమయంలో, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోశాయి. "మనస్సాక్షితో ఓటు వేసిన ఇండియా కూటమి ఎంపీలకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ఆయన పేర్కొనడం విపక్షాలను ఇరకాటంలో పడేసింది. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం రాహుల్ గాంధీ వ్యూహాలకు, కూటమి ఐక్యతకు పెద్ద సవాలుగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అదొక మ్యాచ్ మాత్రమే

తమ పిటిషన్ ను అత్యవసరంగా విచారించాలని పిటిషన్ దారులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై స్పందించిన సుప్రీంకోర్టు ఆదివారం జరగనున్న మ్యాచ్ కు అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అదొక మ్యాచ్ మాత్రమే, జరిగితే జరగనివ్వండి, నష్టమేంటని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పిటిషన్ దారుల తరఫు న్యాయవాది మాట్లాడుతూ శుక్రవారం జాబితాలో చేర్చకపోతే తన పిటిషన్ నిష్ఫలమవుతుందని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ మ్యాచ్ జరుగుతోందని గుర్తుచేశారు. ఈ మ్యాచ్ జరగడం జాతీయ గౌరవం, ప్రజల మనోభావాలకు విరుద్ధమైన సందేశాన్ని పంపుతుందని వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాలకన్నా, పౌరుల ప్రాణాలకన్నా, సైనికుల ప్రాణత్యాగాల కన్నా ఈ మ్యాచ్ ఎక్కువ కాదన్నారు. క్రికెట్ సహా ఏ ఆట అయినా రెండు దేశాల మధ్య స్నేహాన్ని, సామరస్యాన్ని ప్రదర్శిస్తుందని, ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తో మ్యాచ్ జరిగితే ప్రజల్లోకి తప్పుడు సందేశం వెళుతుందని ఊర్వశి జైన్ కోర్టుకు తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు కూడా ఈ మ్యాచ్ కారణంగా వేదనకు గురవుతాయని పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మట్టుబెట్టాయాని గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా తెలిపారు. ఉదయం నుండి భద్రతా దళాలు మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. థానా మెయిన్‌పూర్ ప్రాంతంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో గరియాబంద్ ఈ30, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ను మొదలుపట్టాయి. ఇప్పటివరకు 10 మృతదేహాలను ఆటోమేటిక్ ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మృతుల్లో ఎవరెవరు ఉన్నారనేది అధికారికంగా ఇంకా నిర్ధారించలేదు.గరియాబంద్ జిల్లా ఎస్పీ నిఖిల్ రఖేచా ప్రకారం, ఈ ఎన్‌కౌంటర్ సెప్టెంబర్ 11, 2025 ఉదయం నుంచి మైన్‌పూర్ ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో జరిగింది. మావోయిస్టులు ఈ ప్రాంతంలో ఉన్నారని నిర్దిష్టమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా, ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఈ–30 యూనిట్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) యొక్క కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. ఈ ఆపరేషన్ సెప్టెంబర్ 10, 2025 రాత్రి నుంచి ప్రారంభమై, సెప్టెంబర్ 11 ఉదయం తీవ్రమైన కాల్పులతో ఉధృతమైంది."ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా బలగాలు మావోయిస్టులతో భీకర కాల్పులు జరిపాయి. ఇప్పటివరకు 10 మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాము, పలు ఆటోమేటిక్ ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నాము," అని బలగాల ఉన్నతాధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో ఏకే–47లు, ఇన్సాస్ రైఫిల్స్, ఎస్ఎల్ఆర్లు, ఇతర ఆధునిక ఆయుధాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.మావోయిస్టు సీనియర్ కమాండర్ మనోజ్ అలియాస్ మోడెం బాలకృష్ణ ఈ ప్రాంతంలో ఉన్నాడని నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. బాలకృష్ణ ఒక కీలక మావోయిస్టు నాయకుడిగా పరిగణించబడతాడు. అతని సమక్షంలో ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలు ఊపందుకున్నాయని ఇంటెలిజెన్స్ రిపోర్టులు సూచించాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో అతనితో పాటు ఒడిశా స్టేట్ కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ పాండు కూడా మృతి చెందినట్లు అనధికారిక సమాచారం ఉంది, అయితే ఈ విషయంపై అధికారిక ధృవీకరణ ఇంకా రాలేదు. ఈ ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడానికి భద్రతా బలగాలు చేస్తున్న ప్రయత్నంలో మరో ముందడుగు. 2025లో ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో 225 మంది మావోయిస్టులు వివిధ ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందినట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి, ఇందులో బస్తర్ డివిజన్‌లో 208 మంది ఉన్నారు.

# వారిని తక్షణమే ఇళ్ల నుంచి ఖాళీ చేయించండి

ఆయన ప్రతి అధికారిని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా పురాతన ఇళ్లల్లో నివసించే కుటుంబాలను వెంటనే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే కాజ్‌వేలు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని అడ్డుకునే నిర్మాణాలను తొలగించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్ విభాగం జలాశయాల నీటి మట్టాలను నిత్యం పరిశీలించి అవసరమైతే గేట్లను ఎత్తివేయాలని చెప్పారు.మెదక్ జిల్లాలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడ కేవలం మూడున్నర గంటల్లో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. రాజీపల్లి, పాతూర్ ప్రాంతాల్లో కూడా 8%–%9 సెంటీమీటర్ల వరకు వర్షం పడింది. గాంధీనగర్ కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు వెంటనే జేసీబీలను ఉపయోగించి నీటిని దారి మళ్లించే ప్రయత్నం చేశారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు చెరువులను తలపించడంతో రాకపోకలు కష్టతరమయ్యాయి.వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. 4 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని సూచించింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పంటల సంరక్షణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ క్రమంలో నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. పాత భవనాలు కూలిపోవచ్చని అంచనాతో వాటిని ముందుగానే ఖాళీ చేయడం అవసరం. రహదారులపై విద్యుత్ తీగలు తెగిపోతే వాటిని తాకరాదని హెచ్చరిస్తున్నారు. వర్షాల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని అధికారులు సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అర్బన్ డెవలప్‌మెంట్, మునిసిపల్, ఇరిగేషన్, విద్యుత్, హెల్త్ వంటి శాఖలకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ఎమర్జెన్సీ కంట్రోల్ రూములు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేసింది. ఈ చర్యల ద్వారా వర్షాల ప్రభావాన్ని తగ్గించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

# నేపాల్ ఆందోళనల్లో కొత్త మలుపు

నేపాల్ సైనిక ప్రధాన కార్యాలయం సమీపంలో ఈ ఘటన జరిగింది. మధ్యంతర ప్రధాని పదవి కోసం పలువురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి, ఖాట్మండు మేయర్ బాలేంద్ర షా, నేపాల్ విద్యుత్ అథారిటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కుల్మాన్ ఘీసింగ్ ఉన్నారు. వీరిలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై ఆందోళనకారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. మరోవైపు, దేశంలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలకాలని నేపాల్ అధ్యక్షుడు కోరుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత నిరసనకారులపైనే ఉందని ఆయన గురువారం వ్యాఖ్యానించారు. మొదట సామాజిక మాధ్యమ వేదికలపై స్వల్పకాలిక నిషేధానికి వ్యతిరేకంగా 'జెన్ జెడ్' యువత ప్రారంభించిన ఈ నిరసనలు, అనతికాలంలోనే ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారి హింసాత్మక ఘటనలకు దారితీయడం గమనార్హం. తాజా పరిణామాలతో దేశంలో రాజకీయ అనిశ్చితి మరింత తీవ్రమైంది.

# రాహుల్ గాంధీ గీత దాటుతున్నారు

ఆయన భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు గురువారం ఒక లేఖ రాసింది. రాహుల్ గాంధీ భద్రత విషయంలో అనుసరించాల్సిన పద్ధతులపై ఇందులో స్పష్టమైన సూచనలు చేసింది. రాహుల్ గాంధీకి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను సీఆర్పీఎఫ్ కల్పిస్తోంది. అత్యంత కట్టుదిట్టమైన ఈ భద్రతా వలయంలో ఉన్నప్పటికీ, ఆయన తన విదేశీ ప్రయాణాల వివరాలను భద్రతా సంస్థలకు ముందుగా తెలియజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికార వర్గాలు ఆరోపించాయి. ఇటీవల ఆయన ఇటలీ, వియత్నాం, దుబాయ్, ఖతార్, యూకే, మలేషియా వంటి దేశాల్లో వ్యక్తిగత, రాజకీయ పర్యటనలు చేశారు.

ఈ పర్యటనలకు వెళ్లే ముందు ఆయన భద్రతా సిబ్బందికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. సీఆర్పీఎఫ్‌తో పాటు, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) కూడా ఈ విషయంపై రాహుల్ గాంధీకి నేరుగా ఒక లేఖ రాసి, దీనిని 'తీవ్రమైన అంశం'గా పరిగణించాలని సూచించింది.'యెల్లో బుక్' ప్రోటోకాల్ ప్రకారం, ఉన్నత స్థాయి భద్రత పొందే వ్యక్తులు తమ ప్రయాణ వివరాలను, ముఖ్యంగా విదేశీ పర్యటనల షెడ్యూల్‌ను అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) బృందానికి తప్పనిసరిగా అందించాలి. దీనివల్ల ఆయా దేశాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడానికి వీలుంటుంది. అయితే రాహుల్ గాంధీ ఈ నిబంధనను పదేపదే ఉల్లంఘిస్తున్నారని, ఇది ఆయన భద్రతా వ్యవస్థను బలహీనపరుస్తుందని సీఆర్పీఎఫ్ తన లేఖలో పేర్కొంది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరింది. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేశంలోని కీలక నేతల్లో ఒకరైన రాహుల్ గాంధీ భద్రత విషయంలో కేంద్ర బలగాలు నేరుగా పార్టీ అధ్యక్షుడికి లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖలపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# కుక్కల దాడిలో గొర్రెలు మృతి

మంచిర్యాల: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గుండెల రమేష్ కు చెందిన ఏడు గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. రమేష్ తన గొర్రెలను ఇంటి షెడ్డులో కట్టేసి ఉండగా, అతని భార్య కూలీ పనికి వెళ్ళింది. ఇంటి పరిసరాలు ప్రశాంతంగా ఉన్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అవి మృతి చెందాయి. గురువారం ఇంటికి తిరిగి వచ్చిన రమేష్ దంపతులు మృతి చెందిన గొర్రెలను చూసి కన్నీరుమున్నీరయ్యారు.

## గ్రూప్-1 అవకతవకలపై కమిషన్ ఏర్పాటు చేయాలి:



బెల్లంపల్లి,: గ్రూప్–1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసి, అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బిఆర్ఎస్వి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్, బిఆర్ఎస్వి నాయకులు కలిసి గురువారం ఉట్నూర్లోని స్థానిక ఐబీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలీముద్దీన్, నాయకులు దూట మహేందర్, సాజిద్ సిద్ధికి, కుర్సెంగా భూమాన్న, అజ్మీరా జయచంద్ర, రాజన్న, బొడ్డు నరేష్, పడిదేం శ్రీకాంత్, కుమ్ర కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు స్మరించుకున్నారు

చెన్నూరు,: జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం జన్నారంలోని ఎఫ్డిఓ కార్యాలయం ఆవరణలో అటవీ అమరవీరులకు నివాళులర్పించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ అధికారులు, సిబ్బంది చేసిన ప్రాణ త్యాగాలను ఎఫ్డిఓ రామ్మోహన్ రావు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఎఫ్ఆర్ఓ సుష్మారావు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా

## టీఏజీఎస్ సావనీర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్,: ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) ముద్రించిన ప్రత్యేక సంచికను గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్లో జిల్లా నాయకులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దౌత్రే ఆవిష్కరించారు. కలెక్టర్ సంచికను ప్రశంసిస్తూ, గుస్సాడి కవర్ ఆకర్షణీయంగా ఉందని అన్నారు. జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్, పోరాటాలతో పాటు చైతన్యానికి వ్యాసాలు ముద్రిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాల శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో కుక్కలు స్వైర విహారం

సిర్పూర్,: కాగజ్నగర్ పట్టణంలో వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఒంటరిగా వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రతిరోజూ ఒకరిద్దరు కుక్కకాటుకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని కూడా వెంబడిస్తున్నాయి. కుక్కల నియంత్రణ విషయంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఒగ్గు కథా కళాకారుడు

## చెవుల రాజు గుండెపోటుతో మృతి

హుజూరాబాద్, : హుజురాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గు కథా కళాకారుడు చెవుల రాజు (40) గుండెపోటుతో మరణించారు. గత 15 సంవత్సరాలుగా తన కళతో వేలాది మందిని అలరించిన రాజు ఆకస్మిక మృతి గ్రామంలో విషాదఛాయలు అలుముకుంది. గురువారం ఉదయం తన ఇంటి వద్ద ఉన్న సమయంలో రాజుకు తీవ్రమైన గుండెపోటు రావడంతో, కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆయన అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు.

### ఎస్జీఎఫ్ జోనల్ లెవెల్లో

## గర్రెపల్లి విద్యార్థుల సత్తా



కరీంనగర్,: సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో గర్రెపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అండర్–17 వాలీబాల్ బాలికల, బాలుర విభాగాల్లో, అలాగే అండర్–17 బాలికల కబడ్డీ విభాగంలో మొదటి స్థానాలు సాధించారు. అథ్లెటిక్స్లో కూడా రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆసియాబేగంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## యూరియా కోసం రైతుల పడిగాపులు

పెద్దపల్లి,: ఖాసింపేటలోని రైతు వేదిక వద్ద గురువారం ఉదయం నుంచి రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిరీక్షిస్తున్నారు. యూరియా అందక నిరీక్షించిన రైతులు తమ స్థానాలను కాపాడుకోవడానికి చెప్పులు, రాళ్లను లైన్లలో పెట్టి ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

కరీంనగర్,: కరీంనగర్ బైపాస్ రోడ్డు చేపల ఉత్పత్తి కేంద్రం సమీపంలో ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యాహ్నం బైపాస్ రోడ్డు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ పాఠశాలకు పూర్వపు విద్యార్థుల చేయూత

వికారాబాద్, : చేవెళ్ల జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ముందు వర్షపు నీరు నిలిచే సమస్యకు పూర్వ విద్యార్థులు శాశ్వత పరిష్కారం చూపారు. 1989–90 విద్యా సంవత్సరంలో ఏడవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, పాక్స్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, బండారు చెన్నారెడ్డి, మల్ గారి లక్ష్మారెడ్డిలు ఈ సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చారు. గురువారం నాటికి ఈ పరిష్కారం అమలులోకి వచ్చింది.

## ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేశారు. ఎమ్మెల్యే వివేకానంద్ వారి వినతులను సానుకూలంగా స్వీకరించారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

చేవెళ్ల, : గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, హెచ్ఎండీఏ నిధులు రూ. 30 లక్షలతో శంకర్ పల్లి రోడ్డు నుండి కొనగట్టు శివాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్యాంపెయినింగ్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, చేవెళ్ల పీఏసి ఎస్ చైర్మెన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, చేవెళ్ల మాజీ జడ్పీటీసీ మాలతీ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలి

పినపాక, : మణుగూరు మండలంలోని గుట్ట మల్లారంలో గిరిజన సంక్షేమ గురుకుల బాలికల, జూనియర్ కళాశాలను ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తనిఖీ చేశారు. విద్యార్థినులకు చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలని ఆయన ఆదేశించారు. వంటగది, సామగ్రి, స్టోర్ రూంలను పరిశీలించి, మెనూ అమలుపై విద్యార్థినులతో మాట్లాడారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, విషకీటకాల కారణంగా రాత్రివేళ బయటకు రావద్దని సూచించారు.

## మేజర్ కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

మధిర, : ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం అనాసాగరం–పమ్మి రహదారి, శిథిలావస్థలో ఉన్న వంతెనను సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు సందర్శించి, రైతుల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నిత్యం రైతులు రాకపోకలు సాగించే రహదారి, వంతెన మరమ్మతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని, అనాసాగరం– పమ్మి మార్గంలో మంగాపురం మేజర్ కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకు సరిపడ యూరియా ఇవ్వాలని కోరారు.

## సత్తుపల్లిలో అటవీ అమరవీరుల దినోత్సవం

సత్తుపల్లి, : జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సత్తుపల్లిలో అటవీ అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. అడవుల రక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను మరువొద్దని, వారి ఆశయాలకు అనుగుణంగా అటవీశాఖ సిబ్బంది పనిచేయాలని ఎఫ్డిఓ వాడపల్లి మంజుల తెలిపారు. అడవుల సంరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. విధి నిర్వహణలో అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రైతులకు యూరియా కొరత

### ప్రభుత్వానికి రెడ్డే డిమాండ్



సత్తుపల్లి,: సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డే, తల్లాడ మండలం కుర్నవల్లి సొసైటీలో రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొసైటీ పరిధిలో 5,800 ఎకరాలు సాగు భూములు ఉండగా కేవలం 580 యూరియా బస్తాలు మాత్రమే వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆధ్వర్యంలో సరఫరా అందించాలని ఆయన కోరారు.

### సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ

## సాయుధ పోరాట వారోత్సవాలు

ఖమ్మం,: ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్ నుంచి ఓల్డ్ బస్టాండ్లోని కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత్రావు, టౌన్ సెక్రటరీ ఎస్కే జానీ మియా, జిల్లా అధ్యక్షులు దండి సురేష్, సహాయ అధ్యక్షులు జమ్ముల జితేందర్ రెడ్డితో పాటు జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో డ్రైవర్, రైతులకు

## యూరియా చేర్చిన పోలీసులు

మహబూబాబాద్, : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో మద్యం సేవించి లారీ నడుపుతున్న డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీలో ఉన్న యూరియా లోడు రైతులకు సకాలంలో అందేలా చూడటానికి, ఏఎస్సై షఫీ స్వయంగా లారీని నడుపుతూ కల్వలకు చేర్చారు. ఈ సంఘటనతో రైతులకు యూరియా సకాలంలో అందింది. డ్రైవర్పై కేసు నమోదు చేశారు. బాధ్యతగా వ్యవహరించిన పోలీసులకు ప్రశంసలు దక్కాయి.

## కొమ్మాల సంత రోడ్డు వివాదం

### గ్రామస్తులు, ఎమ్మెల్యే మధ్య ఘర్షణ



పరకాల, : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాల గ్రామంలో సంత రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి శిలాఫలకం వేయగా, గ్రామ పంచాయతీ నిధులు కేటాయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, ఎమ్మెల్యే తన నిధులు కాకుండా జీపీ నిధులను ఉపయోగించాలని డిమాండ్ చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల తీర్మానం మేరకే పనులు జరగాలని వారు కోరుతున్నారు. నిధుల మంజూరీ లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై ప్రజలు ఎమ్మెల్యే రేవూరిపై అసంతృప్తితో ఉన్నారు.

## జనగామ కలెక్టరేట్ ఎదుట ఏబివిపి ధర్నా

జనగామ, : జనగామ కలెక్టరేట్ ఎదుట గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టారు. నెహ్రూ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేదంటే ప్రగతి భవన్ గోడలు బద్దలు కొడతామని విద్యార్థి సంఘం నాయకులు హెచ్చరించారు.

## ఫీజు రియంబర్స్మెంట్ కోసం విద్యార్థుల ధర్నా

వరంగల్ వెస్ట్,: పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థులు భారీగా ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొని, విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## సీసీ కెమెరాలో పులి దృశ్యాలు రికార్డ్

ములుగు, : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప వానగుట్ట ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపుతోంది. నాలుగు రోజుల క్రితం పులి అరుపులు వినిపించాయని స్థానికులు తెలిపారు. ఈ నెల 8న తెల్లవారుజామున, వానగుట్ట సమీపంలోని చెంచు కాలనీలోని కోళ్ల ఫారంలో పులి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. పులి ఇంకా ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వర్షపు నీటితో ప్రభుత్వ పాఠశాల జలమయం

నారాయణఖేడ్,: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థుల పుస్తకాలు తడిసిపోయాయి. ఈ సమస్యపై ఎంఐఎం అధ్యక్షుడు, న్యాయవాది మొహీద్ పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆయన నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, జిల్లా విద్యాధికారితో మాట్లాడి, తరగతి గదుల్లోకి వర్షపు నీరు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 13 సెప్టెంబర్ 2025న

## నేషనల్ లోక్ అదాలత్ నిర్వహణ

సంగారెడ్డి,: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, కోర్టులలో పెండింగ్ లో ఉన్న కేసుల సామరస్య పరిష్కారం మరియు సత్వర న్యాయం అందించేందుకు సెప్టెంబర్ 13, 2025న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పోలీస్ డిపార్ట్మెంట్ నుండి శాను బాయ్ ఈ సమాచారం అందించారు.

## రెండు రోజులుగా కురుస్తున్న వర్షం

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

ఆందోల్, : సంగారెడ్డి జిల్లా మునిపల్లి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని సూచించారు. ఈ వర్షాల వల్ల జనజీవనం స్తంభించిపోయే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా

## రూ 9.95 లక్షల విలువైన సరుకు సీజ్




జహీరాబాద్, : జహీరాబాద్ నియోజకవర్గం, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు సమీపంలోని చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 9 లక్షల 95 వేల 840 రూపాయల విలువైన రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చిరాగ్ పల్లి ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

## కొత్తకోటలో దంచికొట్టిన వర్షం

దేవరకద్ర, : గురువారం తెల్లవారుజాము నుంచి దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోటనలో కురిసిన భారీ వర్షం పట్టణాన్ని ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద నీరు రోడ్లపైకి చేరి, జనజీవనం స్తంభించిపోయింది. వాహనదారులు, పాదచారులకు రాకపోకలు నిలిచిపోయాయి. కూరగాయలు అమ్ముకునే వారికి కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## అనారోగ్యంతో మృతి చెందిన పసుపుల

### మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



మహబూబ్నగర్,: మహబూబ్ నగర్ జిల్లా మహ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన పసుపుల మల్లయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న కమతం రాజేందర్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో, ఆయన అనుచరులు మల్లయ్య కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంపై హర్షం

**- బీసీ సాధికారత సంఘం అమ్మ5జిల్లాధ్యక్షులు : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాల పోరాటాల ఫలితంగా అసెంబ్లీలో అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానంతో గవర్నర్‌కు పంపిన పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ బిల్లులకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం శుభ పరిణామమని ఉమ్మడి కరీంనగర్-ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల జాప్యం వల్ల కేంద్ర 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం, గ్రామాల అభివృద్ధి కుంటుపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా తక్షణమే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లుల ఆమోదం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, అఖిలపక్ష నేతలు, బీసీ మేధావులు, న్యాయనిపుణులు, కళాకారులు, రచయితలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి
# ఏఐటీయూసీ డిమాండ్

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**



వేములవాడ/ సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బి.వై. నగర్లో బీడీ కార్మికుల సమస్యలపై గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ, టేకేదారులు కార్మికులకు వీడిఏ ప్రకారం వేతనాలు చెల్లించకపోగా, 10 వేల బీడీలకు 600 బీడీలు కట్ చేస్తున్నారని, 263 రూపాయలకు బదులు 240 రూపాయలే ఇస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కంపెనీలు పీఎఫ్ కటింగ్ పేరుతో డబ్బు వసూలు చేయడం, కుర్కురేలు అంటగట్టడం మానాలని, కనీస పెన్షన్ 6000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లేబర్ కమిషనర్‌కి ఫిర్యాదు చేసి చట్టపరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.వి. అనసూర్య, సుంకనపల్లి శాంత, ఎంజాల లక్ష్మి, కొండ ఈశ్వరి, కర్రె రాజవ్వ, జడల రూప, ఈడుపు వరలక్ష్మి, మంగళవారం ఈశ్వరి, దూస గీత, ఎల్లం యశోద, వావిలాల పద్మ, కట్ల లత, కుసుమ సునీత, సిరిసిల్ల స్రవంతి, ఊసకోయిల లక్ష్మి, కోడం ప్రమీల, బూర సమ్మవ్వ, దూస లక్ష్మి, దేవక్క తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్

**- భాజపా నేత చంద్రమౌళి హర్షం**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీసీ వర్గాల సుదీర్ఘ పోరాట ఫలితంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానంతో పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ బిల్లులకు గవర్నర్ ఆమోదం లభించడం పట్ల భాజపా చేనేత సెల్ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు, భాజపా సీనియర్ నేత అనుమల్ల చంద్రమౌళి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించి, 42 శాతం బీసీ రిజర్వేషన్లకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం శుభసంకేతమని ఆయన అన్నారు. ఎన్నికల ఆలస్యంతో కేంద్ర 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం, గ్రామాల అభివృద్ధి ఆలస్యం కావడం వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సామాజిక సేవా స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకుందాం

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- మోదీ జన్మదిన వేడుకలకు బీజేపీ శ్రేణుల సన్నాహాలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా భాజపా వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా 15 రోజులపాటు పుట్టినరోజు ఉత్సవాలను సామాజిక సేవా స్ఫూర్తితో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రం మహేష్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, చిత్రలేఖనం పోటీలు, 2కే రన్, అమ్మ పేరుతో మొక్కల నాటకం వంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రతాప భాజపా సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా మోదీ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# రేపటి లోగా యూరియా పంపిణీ చేయాల్సిందే.?

**రేపటి దాకా ఎందుకు ఈ రోజే ఇస్తాములే**
**యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు**

ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రేపటి లోగా యూరియా పంపిణీ చేయాల్సిందే అని రైతులు రోడ్డెక్కారు. రేపటి దాకా ఎందుకు ఈ రోజే ఇస్తాములే అని సాయంకాలం యూరియా లోడ్ ను దించారు. రాచర్ల తిమ్మాపూర్ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. యూరియా ఇవ్వకపోతే అష్టదిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రేపటి లోగా యూరియా పంపిణీ చేయాల్సిందేనని పట్టుబట్టారు. మాయ మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు.
రైతులను హరిగోశ పెడుతున్నారని, రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడలేదని చరిత్రలో ప్రభుత్వాలు ముందుకు పోలేదని వాపోయారు. రోడ్డుపైన భారీగా వాహనాలు నిలిచిపోవడంతో రైతులకు సర్ది చెప్పి నిరసనను విరమింప చేశారు పోలీసులు. తిమ్మాపూర్ గ్రామానికి యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని గురువారం ప్రొద్దున ప్రధాన రోడ్డుపైకి





వచ్చి ధర్నా చేపట్టడంతో స్పందించిన అధికారులు యూరియా లారీని తిమ్మాపూర్ గ్రామానికి పంపించారు. సాయంకాలం యూరియా లోడ్ ను అధికారులు రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో దించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న గాయత్రీ బ్యాంక్

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేసి బ్యాంకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గాయత్రి బ్యాంక్ గత 25 సంవత్సరాలుగా వేములవాడ పరిసర ప్రాంత ప్రజలకు నమ్మకమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తోంది. చిన్న పొదుపుదారుల నుండి వ్యాపార వేత్తల వరకు అందరికీ అండగా నిలుస్తూ అభివృద్ధి సాధించింది. భవిష్యత్తులో కూడా ఆధునిక సాంకేతికతతో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మరింత సేవలందించాలని నా ఆకాంక్ష" అని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఏఐ టూల్స్ పై శిక్షణ తప్పనిసరి

**-జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**

**- వేములవాడ అర్బన్ కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆధునిక ఏఐ టూల్స్ పై శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించిన కలెక్టర్, భోజన నాణ్యత, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత, రహదారి, ప్రహరీ లేమిని గమనించి, వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు, రహదారి, ప్రహరీ నిర్మాణానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు గణితం, సైన్స్, సోషల్, ఎకనామిక్స్ పాఠాలు బోధించి వారి అవగాహనను పరీక్షించిన కలెక్టర్, ఇంటర్ విద్యార్థుల కోసం కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఉపాధ్యాయులు తరగతుల్లోకి ప్రవేశించే ముందు పాఠాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, విద్యార్థులకు సమర్థవంతంగా బోధించాలని సూచించారు.

## పేకాటరాయుళ్లను పట్టుకున్న బుగ్గారం ఎస్సై సతీష్

**-రూ. 5640/- సీజ్ చేసి కేసు నమోదు చేసి,**

**దర్యాప్తు ప్రారంభించి న పోలీసు బృందం**

జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) బుగ్గారం మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బుగ్గారం ఎస్సై సతీష్ తన బృందంతో పేకాటరాయుళ్లపై దాడి చేయగ, గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద గల రూ. 5640/- సీజ్ చేసి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనైనది అని తెలిపారు.




బుగ్గారం మండల పరిధిలో ఎలాంటి నిషేధిత ఆటలు ఆడడంగాని, ఆటలాడే వారిని ప్రోత్సహించడం గాని చేయరాదని మీ గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు తెలిసిన యెడల అట్టి సమాచారాన్ని పోలీసు వారికి తెలియజేసిన, వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం అని బుగ్గారం ఎస్సై సతీష్ తెలిపారు.

## కాస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో
# మౌళిక సౌకర్యాలపై తనిఖీ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని కాస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబివి)లో మౌళిక సౌకర్యాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో సెక్టోరియల్ అధికారి పద్మజా, బోయినిపల్లి మండల విద్యాధికారి నెల్లుట్ల శ్రావణ్ కుమార్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం అవినీతి నిరోధక శాఖ



అధికారులు కేజీబివి విద్యాలయాన్ని సందర్శించి, అనిశా వారు సూచించిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, సదరు విద్యాలయం ఇంచార్జి ఎస్.ఓ.ను విచారించారు. విద్యార్థుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

## గ్రంథాలయంలో నిరుద్యోగుల నిరసన

**ఉద్యోగ క్యాలెండర్ అమలుకు డిమాండ్**

నల్లగొండ, : నల్గొండ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. జాబ్ క్యాలెండర్‌ను త్వరగా అమలు చేయాలని, జీవో నెం. 29ను రద్దు చేసి గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని, జీపీఓ నోటిఫికేషన్‌ను త్వరగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## మూగ మహిళపై అత్యాచారయత్నం

సూర్యాపేట, : ఆత్మకూర్(ఎస్) మండలంలో ఓ వివాహిత మూగ మహిళపై కనుకుంట్ల లింగయ్య అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కొడుకు కేకలు వేయడంతో స్థానికులు ఆమెను రక్షించారు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, కొరివి సైదులు డిమాండ్ చేశారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలోని స్థానిక తోల్బార్ బజార్ నుండి సూర్యాపేట జనగామ రహదారి వరకు రోడ్డు ఫార్మేషన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం జరిగింది. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేదల, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోడుసు లింగయ్య కూడా పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు
# పనులను పరిశీలించిన కలెక్టర్

కోదాడ, : సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ దొండపాడు రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఆరా తీసి, రైతులకు నిరంతరాయంగా నీటి సరఫరా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నాణ్యత ప్రమాణాలతో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ సురేందర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నల్లబండగూడెం హైస్కూల్ ను
# ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

తుంగతుర్తి, : కోదాడ మండలం నల్లబండగూడెం హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంటగదిని పరిశీలించి, నిర్వాహకులకు పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

# పేరుకు పోతున్న చెత్త కానరాని సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** పట్టణంలో పలుచోట్ల, మురికి కాలువల్లో రోజురోజుకు పేరుకు పోతున్న చెత్త కానరాని సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు. గత వైసిపి ప్రభుత్వంలో పట్టణంలో 22 సచివాలయాలు నిర్మించారు. ప్రతి సచివాలయ పరిధిలో ఒక పారిశుద్ధ్య కార్యదర్శిని కూడా నియమించారు. కానీ వారు పారిశుద్ధ్య కార్మికులపై పెత్తనం చేయడం, ఫోటోలు తీసి గ్రూపులో పెట్టడం తప్ప వార్డుల్లో పలుచోట్ల పేరుకుపోతున్న చెత్తను, కాలువలను పూడిక తీశారా లేదా చూడడం లేదు. ప్రతినిత్యం వారు బైక్ సవారీలు తప్ప ఎక్కడ ఏ సమస్య ఉందో ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్న దాకలాలు కూడా లేవు. కానీ వారి పైన ఉన్నతాధికారులు పర్యవేక్షణ కరువుఅవడంతో వారు చేసిందే చట్టం అన్నట్టు తయారవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సచివాలయ కార్యదర్శులు తీరు సాగింది. గతంలో పట్టణ ప్రజలకు ఏ ఒక్కరికి కూడా సచివాలయంలో పారిశుద్ధ్య కార్యదర్శి ఉంటాడని తెలియదు. వారి విధులు, వారు ఎన్ని గంటలకు డ్యూటీ కి వెళ్తారు ఎన్ని గంటలకు ఇంటికి వస్తారో కూడా తెలియదు. ఎందుకంటే కొంతమంది పారిశుద్ధ్య కార్యదర్శులు ఇళ్ళకే పరిమితం అవుతున్నారు. మున్సిపాలిటీ లలో పారిశుద్ధ్యం అంటే మొదట గుర్తొచ్చేది పారిశుద్ధ్య సూపర్వైజర్లు (మేస్త్రీలు) మాత్రమే, వారు ప్రజలతో మమేకమై ఏ వార్డులో ఏ సమస్య ఉన్నా వెంటనే ఫోన్ చేసి తెలుపుగానే స్పందిస్తున్నారు. వారి స్పందించకపోతే వారిపై అధికారి శానిటరీ ఇన్స్పెక్టర్ కి ఫోన్ చేసిన స్పందిస్తున్నారు. అంతేకానీ వార్డులలోని ప్రజలకు సచివాలయంలో ఒక పారిశుధ్య సిబ్బంది ఉంటాడు అన్న విషయమే తెలియడు. ఎవరు ఎప్పుడు డ్యూటీ చేస్తారో ఎక్కడ డ్యూటీ చేస్తారో తెలియని పరిస్థితి. అసలు పారిశుద్ధ్య కార్యదర్శులు ఎప్పుడైనా మేము మీ ఇళ్ల వద్ద కాలువల తీకపోయినా, చెత్త ఎత్తడానికి పారిశుద్ధ్య కార్మికుల రాకపోయినా మాకు తెలపండి అని ఏ ఒక్క ఇంటికి వెళ్లి చెప్పరు కదా, వాళ్లే కమిషనర్ లాగా బైక్ స్వారీ చేస్తూ ఉంటారు వీధుల్లో అంతే తప్ప చాలాచోట చెత్త ఉంది దాన్ని మీరు క్లీన్ చేయండి అని చెప్పిన దాఖలాలు కూడా ఎక్కడా లేవు. ప్రభుత్వాలు వారు ఎలా పని చేస్తున్నారు వారి పనితీరు ఎలా ఉంది అనేది తెలుసుకోకుండా ఉత్త పుణ్యానికి వారికి జీతాలు మట్ట చెబుతున్నారని ప్రజలు బాహాటంగానే విమర్శించుకుంటున్నారు. కనీసం వారు వార్డులలో ఉన్న నాయకులకు గానీ, వారి గురించి తెలిసిన వారికి గాని సమాధానం చెప్పడం లేదంటూ పట్టణ ప్రజలు చెప్పకనే చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వారి విధులు ఏంటో వారు ఏ పని చేయాలో నిత్యం ప్రజల వద్దకు వెళ్లి ఫీడ్బ్యాక్ తీసుకుని అధికారులకు తెలుపవలసిందిగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్య మేస్త్రిలు లేకపోతే కాలువలు ఎక్కడ బ్లాక్ అవుతాయి, ఆ బ్లాక్ అయిన కాలువలను ఎక్కడ శుభ్రం చేయించాలి అనేది వారికి తప్ప సచివాలయ సిబ్బందికి తెలియదు. ఉన్నత అధికారులు గమనించి నిత్యం అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య మేస్త్రీలను ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించే వారిని వినియోగించుకోవాలి తప్ప, సమాధానం చెప్పని సచివాలయ కార్యదర్శి తో పట్టణంలో రోజురోజుకి పారిశుధ్యం పెరిగిపోతుంది. గతంలో కమీషనరే వచ్చి కొన్ని ఏరియాలను పర్యవేక్షించి అక్కడున్న సానిటరీ మేస్త్రీలకు. చెత్తను శుభ్రం చేయించవలసిందిగా కోరిన వెంటనే, దగ్గరుండి మరి శానిటరీ మేస్త్రీలు చెత్తను ఆ ప్రాంతాల్లో తొలగించారు. కనీసం అప్పుడైనా తిరిగి చూడండి సచివాలయ కార్యదర్శులు, అలాంటి వార్డ్ నమ్మి పారిశుధ్యం అప్పజెప్పితే పట్టణం మురికి కోపం లో కొట్టుమిట్టాడుతుందే తప్ప ఏమాత్రం పారిశుద్ధ్య పనులు జరగవు ఇది గమనించి ఉన్నతాధికారులు పనిచేయని సచివాలయ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్లో “సెక్యూరిటీ టెండర్”క్లియర్:చైర్మన్

- ఈ నెలతో పాత కాంట్రాక్టు పూర్తి కావస్తున్నా నేపథ్యంలో కొత్త టెండర్ ప్రక్రియ పూర్తి
- టెండర్లో ఏడుగురు పాల్గొన్నారు.2,46,400/ లక్షలకు”సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్”కి సొంతం అయిన కాంట్రాక్టు
- గతంలో 2,49,062/ కి చేజిక్కించుకున్న సదరు కాంట్రాక్టర్
- సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రస్తుతం షాద్ నగర్, శామీర్ పేట్,గగన్ పహాడ్ తదితర ప్రాంతాల్లో సెక్యూరిటీ సేవలు అందిస్తున్నారు





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్లో గత కొన్నేళ్లుగా వివిధ రకాల సెక్యూరిటీ ఏజెన్సీలు బోయిన్ పల్లి మార్కెట్లో సేవలు అందించారు.కానీ గత దశాబ్ద కాలం నుంచి అరవెల్స్ అధికంగా దేశంలో ఉన్న పదిహేడు రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలు దిగుమతి అవుతున్నాయి.ఈ నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ సంఖ్యలో బోయిన్ పల్లి మార్కెట్ లోకి వాహనాలు రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ జామ్ పెరిగిపోయింది.అలాగే వ్యవసాయ మార్కెట్లో పక్షానికి ఒక సారి వచ్చే అమావాస్య ముందు రోజు మార్కెట్లో డబల్ మార్కెట్ సందర్భంగా దాదాపు మార్కెట్ మొత్తం ట్రాఫిక్ జామ్ తో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు.అదిగాక బోయిన్ పల్లి మార్కెట్ ముఖద్వారం నుంచి మూడు వైపులా కిలో మీటర్ల దూరం వరకు వాహనాలు ట్రాఫిక్ అష్టదిగ్బంధంలో బంధి అవుతున్నాయి.అయితే ఈ నెలతో పాత సెక్యూరిటీ సర్వీసెస్ పూర్తి అవుతున్న నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్ అధికారులు కొత్త టెండర్లు ఆహ్వానించారు. దీనిలో ఏడుగురు వివిధ సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వారు పాల్గొనగా,దానిలో మొదటిగా “సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్:246400/. రెండవది వివేకానంద ఇండస్ట్రీ సెక్యూరిటీ సర్వీసెస్ 259559/. మూడోది శ్రీ సాయి రాం ఇన్ఫ్ర ప్రాజెక్ట్స్ 292640/. మిగిలినవి అప్ సెట్ ఉండడంతో మూడింటినే పరిగణనలోకి తీసుకుని వాటిలో అతి తక్కువగా కోడ్ చేసినది “సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్”వారు సొంతం చేసుకున్నారు.గతంలో పాత సెక్యూరిటీ కాంట్రాక్టర్:249062/ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక మార్కెట్ అధికారులు సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్ వారు సొంతం చేసుకున్నారని ప్రకటించారు.

### కమిటీ చైర్మన్,సెక్రటరీ కొత్త ఆలోచన...

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ 20 ఎకరాల,23 గుంపులుగా విస్తరించి ఉంది.ప్రతి రోజు అరవెల్స్ అధికంగా రావడం వల్ల మార్కెట్లో ట్రాఫిక్ జామ్, ఇక డబుల్ మార్కెట్ వల్ల అయితే కొత్తగా చెప్పాల్సిన పనిలేదు!మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో ట్రాఫిక్ జామ్ జరుగుతున్న ప్రతి సారి సెక్యూరిటీ పరంగా సేవలు అందిస్తున్న సిబ్బందితో పాటు సెక్రటరీ నుంచి మొదలు కొని గ్రేడ్,టూ,త్రీ,సిబ్బంది కూడా గ్రౌండ్లో ట్రాఫిక్ జామ్ క్లియర్ చేయడానికి చెమటోడిస్తే కానీ పయ్య (చక్రం) ముందుకు సాగదు.రేపు కొత్తగా బాధ్యతలు చేపట్టే సెక్యూరిటీ ఏజెన్సీకి నూతన విధి విధానాలతో ముందుకు పోవాలని సూచనలు సలహాలతో కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,మార్కెట్ సెక్రటరీ ఎం.వేంకన్ననిర్ణయాలు తీసుకోవడం విశేషం.అయితే గొప్ప విషయం ఏమిటంటే కొత్త గా బాధ్యతలు చేపట్టిన “సోల్జర్ సెక్యూరిటీ సర్వీసెస్” నిర్వాహకులు ట్రాఫిక్ జామ్ విషయంలో క్లియర్ చేయడంలో దిట్ట అన్న విషయం విశ్వసనీయ సమాచారం.ఏదేమైనా బోయిన్ పల్లి మార్కెట్లో రద్దీ నుంచి బయట వేసే భరోసా ఇస్తే చాలని మార్కెట్ లో పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు వైస్ చైర్మన్ దేవేందర్, మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్న,గ్రేడ్ టూ సత్యనారాయణ,గ్రేడ్ త్రీ మహ్మద్ ఖాజా,డిఇఓ మధు,సాయి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు మారకపోతే మంథని నుంచే ప్రళయం వస్తది

- **<u>దుద్దిళ్ల కుటుంబానికి పదవులు వస్తే పోలీసుల అరాచకాలు మొదలైతయ్.</u>**
- **<u>ప్రజల గురించి ఆలోచన చేయని 420హామీల మానిఫెస్టో చైర్మన్ దుద్దిళ్ల .</u>**
- **<u>నేపాల్ ప్రభుత్వం ఆంక్షలు పెడితే ఏం జరుగుతుందో గమనించాలే.</u>**
- **<u>మంథనిలో నేపాల్ పరిస్థితి పునరావృతం కాకుండా పోలీసులు మారాలి,</u>**
- **<u>పోలీసులకు ఉద్యోగాలు ఇచ్చింది బారత రాజ్యాంగమని గుర్తించాలే.</u>**
- **<u>ఓట్లు వేసి పదవులిచ్చిన ప్రజలకు ఒక్క శాతం పనిచేయని మంథని ఎమ్మెల్యే.</u>**
- **<u>ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.</u>**




**మంథని ( ప్రశ్న న్యూస్)** రాజకీయ పార్టీలను, ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించే హక్కు ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో మంథని నియోజకవర్గంలో పోలీసులు మారక పోతే మంథని నుంచే ప్రళయం మొదలు అవుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హెచ్చరించారు. గురువారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో పోలీసుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, దుద్దిళ్ల కుటుంబానికి ఎప్పుడు పదవులు వస్తే అప్పుడు వాళ్ల నిజస్వరూపాలను చూపించడం పరిపాటిగా మారిందన్నారు. దుద్దిళ్ల కుటుంబానికి వత్తాసు పలికే పోలీసులను ఇప్పటికే అనేకమార్లు అప్రమత్తం చేశామని ఆయన గుర్తు చేశారు. పోలీసుల్లో ఎస్సీలు, బీసీలు ఉన్నారని, వాళ్లను వాడుకుని కరివేపాకులా పడేయడం దుద్దిళ్ల కుటుంబానికి అలవాటేనని, వాళ్లకు ప్రేమ ఆప్యాయతలు ఉండవని ఎదుటివారిపై మిమ్మల్ని ఉపయోగించుకునేందుకు వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21నెలలు గడుస్తున్నా 420హామీలకు మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే యూత్,మహిళా రైతు డిక్లరేషన్‌ల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. వృద్దులు వికలాంగుల పించన్ పెంపు కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. అయితే సోషల్ మీడియా విషయంలో పోలీసులు, ప్రభుత్వం అత్యుత్సాహం చూపిస్తోందని, ఇప్పటికే అనేక మందిపై కేసులు నమోదు చేశారన్నారు. ఇలాంటిదే నేపాల్‌లో యువత మా ఆకలి తీర్చాలని ఆలోచన చేయడం లేదని, మా ఆశీస్సులతో విలాసాలు గడుపుతున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అది జీర్ణించుకోలేని ప్రభుత్వం ఆంక్షలు పెట్టిందని, కానీ ప్రస్తుతం అక్కడ ఎలాంటి పరిస్థితులను ప్రభుత్వం ఎదుర్కొంటుందో మనం చూస్తూనే ఉన్నామని అన్నారు. అలాంటి పరిస్థితి మంథనిలో పునరావృతకాకుండా పోలీసులు, ప్రభుత్వం, ముఖ్యంగా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరువాలన్నారు. మంథని నియోజకవర్గాన్ని సింహబాగం మంథని ఎమ్మెల్యే ఆయన తండ్రి పాలించారని, ప్రస్తుతం 21నెలలు గడిచినా ఈప్రాంతంలో 21కార్యక్రమాలు చేయలేదని, 21మందికి ఉద్యోగాలు ఇప్పించలేదని విమర్శించారు.అయితే సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అక్రమ కేసులు పెడుతున్నారని, నల్లబాలు అలియాస్ శశిధర్ అనే వ్యక్తి ప్రభుత్వంపై కాంగ్రెస్ పాలన రాష్ట్రానికి చీడపురుగులాంటిదని వ్యాఖ్యానిస్తే అతనిపై కేసులు పెట్టి అరాచకం చేసిండ్లని తెలిపారు. ఈ విషయంలో హైకోర్డు ఆ కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని, తొమ్మిది రాష్ట్రాల్లో కేసులను పరిశీలిస్తే కేసులన్నీ కానిస్టేబుళ్లు ఎఫ్ఐఆర్ చేస్తున్నారని తేలిందని ఇది అవమానకరమని హైకోర్డు వెల్లడించిందన్నారు. అంతేకాకుండా ఎవరిమీదనైతే ఆరోపణలు చేస్తరో ఆ వ్యక్తి స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పిందన్నారు. హైకోర్డు తీర్పు వెలువరించిన క్రమంలో మంథని పోలీసుల్లో మార్పు రావాలన్నారు. బారత రాజ్యాంగం మాత్రమే మీకు ఉద్యోగాలు ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమో రేవంత్‌రెడ్డో దుద్దిళ్ల శ్రీధర్‌బాబో మీకు ఉద్యోగాలు ఇవ్వలేదని విషయాన్ని గుర్తించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆనాడు గొప్పగా ఆలోచన చేసి రాజ్యాంగం రాసి ఉండకపోతే ఈనాడు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు,భూములు చదువు ఉన్నవాళ్లకే ఓటు హక్కు ఇచ్చేదన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే వాళ్లకు ఒక్కశాతం కూడా మంథని ఎమ్మెల్యే పని చేయలేదని ఆయన విమర్శించారు. నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తే మంచి పదవులు వస్తాయే కానీ పోలీసులు జైలుకు పోతే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడుతాయనే విషయాన్ని గమనించాలన్నారు. పోలీసులు జైలుకు పోతే దుద్దిళ్ల శ్రీధర్‌బాబో ఆయన సోదరుడు జోకర్ శ్రీనో వచ్చి కాపాడరని ఆయన స్పష్టం చేశారు. ఈనాడు యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారని, యూరియా బస్తాలను కాంగ్రెస్ నాయకులకు ఇచ్చి రైతులను గోసపెడుతున్న దుద్దిళ్లపై కేసు పెట్టాలన్నారు.ఆనాడు ఆడవాళ్ల మీటింగ్‌లకు పోయి బెల్ట్‌షాపులు బంద్ చేయిస్తం, 500బోనస్ ఇస్తమని, అవసరమైతే సోనియమ్మదగ్గరకు పోతామని గొప్పలు చెప్పుకున్నారని, వాటిని అమలు చేయడంపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్న
# పనులే చేస్తున్నాం

- 43 కుల సంఘాల భవనాలకు రూ.2.58 కోట్లు మంజూరు
- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలు కుల సంఘాలకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా మంజూరైన పత్రాలను అందజేశారు.బాలానగర్, లాలానగర్,తిప్పాపూర్ ప్రాంతాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసి, బాలానగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ప్రజా ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్న పనులే చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ప్రతి రోజూ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కుల సంఘాలు, మహిళా సంఘాల కోసం భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం అందులో భాగమే” అని తెలిపారు.

### కాళేశ్వరం కాదని ఎల్లంపల్లి నీళ్లు ఇచ్చేది

కొంతమంది కాళేశ్వరం లేకపోతే నీళ్లు రావని ఫ్లెక్సీలు కడుతున్నారని,అసలు పెట్టాల్సింది ఎల్లంపల్లి లేకుంటే నీళ్లు రావని అని విమర్శించారు. “ఈ సంవత్సరం మేడిగడ్డ వద్ద నీరే ఆపలేదు. అన్నారం, సుందిళ్ల వద్ద బొంగలు పడి చుక్క నీరు నిలువలేదు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు కూడా నీరు నిలిస్తే ప్రమాదమని రిపోర్ట్ ఇచ్చారు. అయినా కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు” అని ఆది శ్రీనివాస్ అన్నారు.మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఎల్లంపల్లి, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారానే ప్రస్తుతం నీరు వస్తోందని స్పష్టం చేశారు. “కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని పి.సి.గోస్ కమిషన్ చెప్పింది. సీఎం రేవంత్ రెడ్డి సిబిఐ విచారణకు ఆమోదం తెలిపి గొప్ప నిర్ణయం తీసుకున్నారు” అని పేర్కొన్నారు.కుల సంఘాలకు ఇప్పటివరకు లేని నిధుల మంజూరువేములవాడ పట్టణంలో ఇప్పటివరకు ఎవరూ కుల సంఘ భవనాలకు నిధులు ఇవ్వలేదని గుర్తుచేసి, “ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 43 కుల సంఘాలకు 2 కోట్లు 58 లక్షల రూపాయలు మంజూరు చేశాం. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది” అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## లొంక రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




**సిరికొండ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రం నుండి 9 కిలో మీటర్ల దూరంలో గల దట్టమైన అడవిలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ పర్వత వర్ధిని సహిత లొంక రామలింగేశ్వర స్వామి ఆలయ క్షేత్రాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం దర్శించుకున్నారు. పుష్కరిలో స్నానం ఆచరించి సైకత లింగానికి లింగాష్టకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అలాగే ఆలయ క్షేత్రం పరిసరాలను అన్నిటిని పరిశీలించారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ దట్టమైన అడవిలో రెండు కొండల మధ్యలో వెలిసిన ఆలయ క్షేత్రం చాలా ప్రసిద్ధన్నారు. పచ్చని చెట్లు,నీటి సెలయేళ్లు ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సిపి ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సీఐ బిక్షపతి, ఆలయ పండితుడు దండాల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు అవధూత గంగాధర్, దాసరి మారుతి, పారిపెల్లి రాజ్ కుమార్, కంచెట్టి లక్ష్మీనారాయణ, బాడాల సంతోష్ పారిపల్లి బీసీల్, అంగూరి గణేష్ గౌడ్, సైరి ప్రశాంత్ సిరికొండ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దమ్మన్నపేట ఉన్నత పాఠశాలలో
# పిల్లలే గురువులైన రోజు

- కని పెంచిన తల్లిదండ్రుల తర్వాత గురువేలే మొదటి దైవం
- విద్యను పంచితే పెరుగుతుంది ధనం పంచితే తరుగుతుంది




**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ధమ్మన్నాపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొంత పాలన, గురుపూజోత్సవం రెండు కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్న దమ్మన్నపేట ఉపాధ్యాయ బృందం. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారూ. ఉపాధ్యాయులను హెచ్ఎం రామ్ చందర్ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలదండలతో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ప్రధానోపాధ్యాయులు రామచందర్ ఆధ్వర్యంలోగురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామచందర్ మాట్లాడుతూ కని పెంచిన తల్లిదండ్రుల తర్వాత గురువే మొదటి దైవం అని అంటారు అందులో భాగంగా మట్టిలోని మాణిక్యాలు తీసేదే ఈ ఉపాధ్యాయులు, విద్యను పంచితే పెరుగుతుంది ధనం పంచితే తరుగుతుంది ఉపాధ్యాయులు ఎంతో సేవలు చేస్తున్నారు వారికి ధన్యవాదాలు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచందర్, పి ఆర్ టి యు అధ్యక్షులు వెంకట రాజారెడ్డి, బి. అనిల్ కుమార్, ఎస్. రమణారావు, పి. రాజేశ్వర్, ఎస్. అనురాధ, టి. దుర్గాదేవి, టి. అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు




## షారూఖ్, దీపికాకు

# భారీ ఊరట

## ముందస్తు బెయిల్ మంజూరు

బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్, స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెలకు భారీ ఊరట లభించింది. సెక్యూరిటీ ఫీచర్స్ లేని ఓ కారు కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తురంటూ నమోదైన కేసులో రాజస్థాన్ హైకోర్టు వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ ప్రాంతానికి చెందిన అడ్వొకేట్ కీర్తి సింగ్ హ్యూందాయ్ కారును కొనుగోలు చేశారు. అయితే, కొన్న కారులో చాలా డిఫెక్ట్స్ ఉన్నాయని, తాను బ్రాండ్ అంబాసిడర్లను చూసే కారును కొనుగోలు చేశానని, తనకు న్యాయం చేయాలంటూ కీర్తి సింగ్.. షారూఖ్ ఖాన్, దీపికా పదుకొణెతో మరో ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. తాజాగా, బాధితురాలు ఇటీవలే రాజస్థాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ షారూఖ్ ఖాన్ తరఫున వాదిస్తూ.. తన క్లయింట్ షారూఖ్ ఖాన్‌కు ఈ కేసుతో నేరుగా ఏమాత్రం సంబంధం లేదని వాదించారు. పటిషనర్ ఆరోపించిన డిఫెక్టులకు అతడు బాధ్యత వహించలేడని తెలిపారు. ఎండార్స్‌మెంట్స్ తయారీ ప్రమాణా లకు బాధ్యతను సూచించవని ఆయన కోర్టుకు విన్నవించారు. అదేవిధంగా దీపికా పదుకొణె తరఫున అడ్వొకేట్ మాధవ్ మిత్రా కూడా ఇవే విషయాలను ధర్మాసనం దృష్టి తీసుకెళ్లారు. తన క్లయింట్ దీపికా పదుకొణెకు కార్ల ఉత్పత్తి, నాణ్యత నియంత్రణలో ఎటువంటి పాత్ర లేదని పేర్కొన్నారు. అడ్వొకేట్ కీర్తి సింగ్ చేస్తున్న ఆరోపణలు షారుఖ్ ఖాన్, దీపికా ఎండార్స్‌మెంట్లు, వినియోగదారులను పూర్తి తప్పుదారి పట్టిం చేలా ఉన్నాయని కామెంట్ చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న రాస్థాన్ హైకోర్టు ధర్మాసనం షారూఖ్ ఖాన్, దీపికా పదుకొణెతో పాటు మరో ఆరుగురిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్టే విధించింది. కేసులో వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లుగా తీర్పును వెలువరించింది. కేసులో తదుపరి విచారణను కోర్టు సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది.

# ది మోస్ట్ లక్కీ డైరెక్టర్



ఇండస్ట్రీలో హీరోకైనా ఇంకెవరికైనా మార్కెట్ ని కొలిచేందుకు సక్సెసే ప్రామాణికం. ఇది ఉంటేనే జనంలో ఆసక్తి ఉంటుంది, బయట మంచి రేట్ పలుకుతుంది. వరస ఫ్లాపుల్లో ఉన్నప్పుడు ఎవరైనా దూరంగా ఉండటం సహజం. వివి వినాయక్, ముప్పలనేని శివ లాంటి ఒకప్పటి బ్లాక్ బస్టర్ డైరెక్టర్లు ఇప్పుడెందుకు సినిమాలు తీయడం లేదంటే నిర్మాతలు ముందుకు రాకపోవడమే. కానీ శ్రీను వైట్ల సుడి బ్రహ్మాండంగా ఉంది. ఈయన నుంచి చివరిగా వచ్చిన చెప్పుకోదగ్గ చిత్రం బాద్షా. 2013లో రిలీజైన ఈ జూనియర్ ఎన్టీఆర్ బొమ్మ రికార్డులు బద్దలు కొట్టలేదు కానీ కమర్షియల్ గా వర్కౌట్ అయిపోయి నిర్మాతను సేఫ్ చేసింది.దీని తర్వాత శ్రీను వైట్ల మళ్ళీ తన స్థాయి మేజిక్ చేయలేదు. ఆగడు, బ్రూస్ లీ, మిస్టర్, అమర్ అక్బర్ ఆంటోనీ వరసగా ఒకదాన్ని మించి మరొకటి చాలా చేదు ఫలితాలను చూశాయి. దెబ్బకాయన ఏకంగా ఎనిమిదేళ్ల గ్యాప్ తీసుకుని గత ఏడాది గోపీచంద్ విశ్వంతో రీ ఎంట్రీ ఇచ్చాడు. ఏదో ప్రమోషన్లలో హడావిడి చేశారు కానీ ఇది కూడా హిట్టు కిందకు రాదు. కొన్ని సెంటర్స్ లో ఓ మోస్తరుగా ఆడింది కానీ మరీ టీమ్ చెప్పుకున్నంత నెంబర్లు రాలేదు. కట్ చేస్తే ఇప్పుడు నితిన్ కాంబోలో శ్రీను వైట్లకో సినిమా సెట్ కావడం ఆశ్చర్యం కలిగించే విషయం. అది కూడా మైత్రి లాంటి బడా బ్యానర్ అంటే మాటలు కాదు. ఈ అవకాశాన్ని శ్రీను వైట్ల సంపూర్ణంగా వాడుకోవాలి. ఇన్ సైడ్ టాక్ ప్రకారం ఈసారి చాలా మంచి సబ్జెక్టు రాసుకున్నారట. మొత్తం తానే కాకుండా యంగ్ రైటర్లను పెట్టి డిఫరెంట్ గా అనిపించే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నారని తెలిసింది.



## అవరాపన్' సీక్వెల్‌లో

# దిశా పటాని ఫిక్స్?

బాలీవుడ్ యంగ్ బ్యూటీ దిశా పటాని గత ఏడాది 'కల్కి'తో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. ఈ అమ్మడు వెల్‌కమ్ టూ ది జంగిల్, మలంగి-2, సంఘమిత్ర వంటి చిత్రాల్లో కనిపించబోతుంది. షూటింగ్స్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీ అయిపోయింది. ఈ క్రమంలో.. తాజాగా,దిశా పటాని ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ హాట్ బ్యూటీ 'అవరాపన్-2'లో హీరోయిన్‌గా కనిపించనున్నట్లు టాక్. ఈ మూవీ స్టోరీ చిత్రబృందం దిశా పటానికి చెప్పగా.. అది నచ్చడంతో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఇందులో ఇమ్రాన్ హాష్మీ హీరోగా నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా 'అవరాపన్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ, భావోద్వేగాలతో 'అవరాపన్-2' రాబోతుండగా.. నితిన్ కక్కర్, ముఖేష్ భట్ తెరకెక్కిస్తున్నారు. విశేష్ భట్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా.. జనవరి నాటికి పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 3న థియేటర్స్‌లోకి రాబోతుంది.


## అనుష్క ఏదో ఒకటి

# తేల్చేయాలి



తాను బయట కనిపించకపోయినా పర్లేదు తెరమీద దర్శనమిస్తే చాలు టికెట్లు కొనే జనాలున్నారన్న అనుష్క అంచనాలను ఘాటీ పూర్తిగా మాయం చేసింది. వచ్చిన కాసిన్ని ఓపెనింగ్స్ ఆమె ఖాతాలోకే వేసినా అవి కూడా మరీ తీసికట్టుగా ఉండటం ఆలోచించాల్సిన విషయం. ఆచార్య, ఆఫీసర్, రూలర్ లాంటి డిజాస్టర్లతో పోలుస్తున్నారంటే సినిమా ఏ స్థాయిలో ఆడిందో అర్థం చేసుకోవచ్చు. ఆడియో రూపంలో స్వీటీ చేసిన పబ్లిసిటీ వల్ల ఏ ఉపయోగం కలగలేదు. ఇప్పుడు తన నుంచి వస్తున్న నెక్ట్స్ మూవీ మలయాళంలో తీసిన కథనర్. ఇది పీరియాడిక్ డ్రామా. తెలుగులోనూ డబ్బింగ్ చేసి సమాంతరంగా వదులుతారు.ఇక అనుష్క ఏదో ఒకటి తేల్చుకునే టైం అయితే వచ్చేసింది. సినిమాలు కొనసాగించాలంటే స్పీడ్ పెంచాలి. నాలుగు పదుల వయసు వచ్చినా ఇంకా పెళ్లి చేసుకోకపోవడం తన వ్యక్తిగత విషయం. ఆ మాటకొస్తే త్రిష లాంటి వాళ్ళు కూడా ఈ క్లబ్బులో ఉన్నారు. ఇప్పటికీ చేతి నిండా నాలుగైదు సినిమాలతో ఆమె బిజీగా ఉంది. కానీ అనుష్క సంగతి వేరు. మీడియా కెమెరాల ముందుకు రావడం లేదు. తన రూపం కోసం ఆలా చేస్తోందా లేక ఇంకేమైనా కారణాలున్నాయా అనేది తెలియలేదు, ఇకపై తన దగ్గరికి వచ్చే కథలు, దర్శకులను వెయిట్ చేయించకుండా త్వరగా నిర్ణయాలు తీసుకుంటే కెరీర్ బాగుటుంది. ఘాటీలో అనుష్క మరీ బ్యాడ్ గా అనిపించలేదు. కొంచెం బొద్దుగా ఉన్నా చూడబుల్ గా ఉంది. కొన్ని సీన్స్ లో బాగా పెర్ఫార్మ్ చేసింది కూడా. అలాంటప్పుడు రెగ్యులర్ గా చేస్తూ ఉంటే ఆడియన్స్ తో కనెక్టివిటీ ఉంటుంది. ఎక్కువ గ్యాప్ తీసుకున్నా పాత స్థాయిలో ఆదరణ దక్కించుకునే వెసులుబాటు హీరోయిన్లకు ఉండదు. ఎనిమిదేళ్లు మేకప్ కి దూరంగా ఉన్నా చిరంజీవిని ఆదరించిన జనం విజయశాంతిని అదే స్థాయిలో రిసీవ్ చేసుకోలేకపోయారు. సో కంటిన్యూటీ చాలా అవసరం. మరి అనుష్క కనక ఫిల్మోగ్రఫీ పెంచుకునే ఉద్దేశంలో ఉంటే మాత్రం యువి క్రియేషన్స్ కాకుండా బయట సంస్థలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

# మంచి ఛాన్స్ మిస్సవుతున్న పవన్



'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా స్థాయిలో వెలిగిపోవాలని ప్రతి స్టార్ హీరో ఆశపడ్డవాడే. కానీ అందరికీ కాలం కలిసి రాలేదు. పాన్ ఇండియా లేబుల్ వేసుకుని వచ్చిన చాలా సినిమాలు దారుణమైన ఫలితాలు అందుకున్నాయి. కొన్ని చిత్రాలకూ దేశవ్యాప్తంగా అనూహ్యమైన ఆదరణ దక్కి హీరోలకు ఊహించని ఫాలోయింగ్ వచ్చింది. రాజకీయాల్లోకి వెళ్లాక సినిమాల మీద ఫోకస్ తగ్గించినప్పటికీ ఆయన కొన్ని పాన్ ఇండియా ప్రయత్నాలు చేశారు. సర్దార్ గబ్బర్ సింగ్, హరిహర వీరమల్లు చిత్రాలతో తెలుగేతర భాషల వాళ్లనూ ఆకట్టుకోవాలని చూశారు. కానీ ఆ సినిమాల్లో కంటెంట్ బలంగా లేకపోవడంతో పాన్ ఇండియా రిలీజ్ నామమాత్రం అయింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సరిగా ఆడని ఈ చిత్రాలు.. మిగతా చోట్ల ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. ఐతే పవన్ పాన్ ఇండియా లాంచింగ్‌కు సరైన సినిమా చేతిలో ఉన్నప్పటికీ.. ఇప్పుడు ఆ దిశగా ప్లానింగ్ సరిగా లేకపోవడం అభిమానులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. ఓజీ.. పవన్ కెరీర్లోనే అత్యధిక హైప్‌తో వస్తున్న సినిమా. ఈ సినిమా కోసం అభిమానులు ఊగిపోతున్నారు. యుఎస్‌లో ఈ సినిమాకు రెండు వారాల ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. ఆల్రెడీ ఈ చిత్రం మిలియన్ మార్కును దాటేసింది. కల్కి, పుష్ప లాంటి చిత్రాల కంటే వేగంగా ఆ మార్కును అందుకుందీ చిత్రం. తెలుగు రాష్ట్రాల్లో బుకింగ్స్ ఓపెన్ చేసినా రచ్చ మామూలుగా ఉండదని అర్థమవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చూసి ఇతర భాషల వాళ్లు కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కానీ 'ఓజీ' పాన్ ఇండియా రిలీజ్ విషయంలో మేకర్స్ అంత సీరియస్‌గా ఉన్నట్లు లేరు. ఇతర భాషల్లో అసలు ప్రమోషన్ అన్నదే లేదు. హిందీలో చాలా లిమిటెడ్ రిలీజ్ ఉండబోతోంది సినిమాకు. ఓటీటీ విండో 8 వారాల్లోపు ఉండడంతో నార్త్ మల్టీప్లెక్సులు ఈ సినిమాను ప్రదర్శించబోవు. లేక లేక పవన్ నుంచి అభిమానులు ఆశించే బలమైన కంటెంట్ ఉన్న, హీరోయిక్ మూవీ వస్తుంటే.. దీన్ని ఇతర భాషల్లో సరిగా రిలీజ్ చేయకపోవడం, ప్రమోట్ చేయకపోవడం పట్ల అభిమానుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అసలు తెలుగులో కూడా ఈ సినిమాను సరిగా ప్రమోట్ చేయట్లేదు. దీనికి ఉన్న హైప్ దృష్ట్యా తెలుగులో పబ్లిసిటీ లేకపోయినా పర్వాలేదు. కానీ ఇలాంటి సినిమాకు పాన్ ఇండియా రిలీజ్, ప్రమోషన్ ప్లానింగ్ లేకపోవడం చూస్తే మంచి ఛాన్స్ మిస్సవుతున్నట్లే కనిపిస్తోంది.



## అందురూ నన్ను సూపర్ హీరో

## అని పిలుస్తుంటే గర్వంగా ఉంది

మలయాళ యంగ్ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ఇటీవల 'లోకా చాప్టర్-1 చంద్ర' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ మూవీ విమర్శలు అనుకున్నప్పటికీ భారీ కలెక్షన్లు రాబడుతూ బాక్సాఫీసును షేక్ చేస్తోంది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కళ్యాణి ప్రియదర్శన్ ఎమోషనల్ కామెంట్స్ చేసింది. "అందరు నన్ను ఫిమేల్ సూపర్ హీరో అని పిలుస్తుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది.

నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. నాకు చాలా గర్వంగా ఉంది. 'లోకా చాప్టర్-1' విజయం సాధించడానికి మా టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. నేను ఈ సినిమాకు సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని అనుకున్నాను.

ఈ సినిమా మొత్తాన్ని నా భుజాలపై వేసుకొని మోసానంటూ అందరూ అభినందిస్తున్నారు. కానీ మా టీమ్ అంతా ఆడ, మగ తేడా లేకుండా కష్టపడ్డారు. 'లోక చాప్టర్-1' మొదటి ఫిమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రలోనైనా నటించగలరని నమ్ముతున్నారు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# మళ్లీ హీరోగా సునీల్ సినిమా



ఒక సమయంలో బ్రహ్మానందంను కూడా వెనక్కి నెట్టి టాలీవుడ్లో నంబర్ వన్ కమెడియన్‌గా ఒక వెలుగు వెలిగాడు సునీల్. కానీ 'అందాల రాముడు'తో అనుకోకుండా హీరోగా మారి హిట్టు కొట్టిన అతను.. ఆ తర్వాత పూల రంగడు, మర్యాద రామన్న చిత్రాలతోనూ విజయాలు అందుకోవడంతో కామెడీ వేషాలు వదిలేసి సీరియస్‌గా హీరో వేషాల మీదే ఫోకస్ పెట్టాడు. కానీ ఈ ఆలోచనే ఒక దశలో తన కెరీర్‌ను ప్రశ్నార్థకం చేసింది. హీరోగా వరుసగా ఫెయిల్యూర్లు ఎదుర్కొని రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది తన పరిస్థితి. దీంతో ఒక దశ దాటాక హీరో వేషాలు వదిలేసి మళ్లీ కామెడీ ట్రై చేశాడు. అవి వర్కవుట్ కాకపోతే క్యారెక్టర్, విలన్ వేషాల వైపు మళ్లాడు. అవి కొంతమేర క్లిక్ అయి ఇప్పుడు తన కెరీర్ బాగానే నడుస్తోంది. ఐతే సునీల్‌ను ఇక మళ్లీ హీరో వేషాల్లో చూడలేమనే అంతా అనుకుంటున్న సమయంలో అతను లీడ్ రోల్‌లో ఒక సినిమా చేస్తున్న విషయాన్ని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ వెల్లడించారు. తమ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్లో తెరకెక్కుతున్న కొత్త చిత్రాల గురించి వివరిస్తూ.. సునీల్‌తో 'మర్యాద కృష్ణయ్య' అనే సినిమా గురించి ప్రస్తావించారు విశ్వప్రసాద్. ఈ ఏడాదే ఆ సినిమా రిలీజవుతుందని కడూ ఆయన ప్రకటించారు. ఐతే ఇదేమీ కొత్త చిత్రం కాదు. నాలుగేళ్ల కిందట ఈ సినిమాను అనౌన్స్ చేశారు. 'మర్యాద రామన్న'లో సునీల్‌కు జోడీగా నటించిన సలోనినే ఇందులో కూడా హీరోయిన్. 'మనసంతా నువ్వే' దర్శకుడు వి.ఎన్.ఆదిత్య ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఈ మూవీ షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. కానీ ఏవో కారణాలతో విడుదల కాలేదు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ చిన్న బేనర్‌గా ఉన్నపుడు వేరే నిర్మాతలతో కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు విశ్వప్రసాద్. కానీ ఇప్పుడా సంస్థ టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బేనర్స్‌లో ఒకటిగా ఎదిగింది. రెండంకెల సంఖ్యలో సినిమాలు నిర్మిస్తోంది.

## గ్రూప్ -1 ఫలితాల రద్దుతో నిరుద్యోగుల

# కలలను నీరుగార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- హైకోర్టు ఆదేశాలను అమలు చేసి మెయిన్స్ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలి**

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు : ఏనుగు మనోహర్ రెడ్డి డిమాండ్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో వేలాది నిరుద్యోగ యువత భవిష్యత్తును హైకోర్టు తాజా తీర్పు తారుమారు చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ఫలితాలను రద్దు చేయడం వల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిరుద్యోగుల కలలు చెదిరి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను అక్షరాలా అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెంటనే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద లాయర్లతో సుప్రీంకోర్టుకు వెళ్లడం అనేది విద్యార్థుల గొంతు కోసినట్టే అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గ్రూప్-1 పరీక్షల్లో ఇంత అవినీతి జరగడానికి అసలు కారణాలేమిటి? ఎవరు దానికి బాధ్యులో? అన్నది వెలుగులోకి తేవాలని, పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను బహిర్గతం చేయాలని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పును ఒప్పుకొని పరీక్షను రద్దు చేయడం ద్వారానే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని ఏనుగు మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.

## సేంద్రీయ పదార్థాలతో

# భూమి సారాన్ని పెంచుకుందాం

**- శిక్షణ సహాయ వ్యవసాయ సంచాలకులు : రామారావు**

**- మండల వ్యవసాయ అధికారి : సాయి కిరణ్**

**- శాత్రాజుపల్లిలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం**

**- ఆదర్శ రైతు కూరగాయల వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కూరగాయల శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు,నిపుణులు అగ్నియస్త్రం,బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం,దశపర్ణిక కషాయం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి పోషక ద్రావకాలు, సేంద్రియ పురుగు మందుల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. ఆవు మూత్రం, ఆవుపేడ ఆధారంగా తయారయ్యే ఈ పదార్థాలు భూమి సారాన్ని పెంచి పంటలను ఆరోగ్యకరంగా చేస్తాయని వివరించారు. ప్రస్తుతం ఆదర్శ రైతు శ్రీనివాస్ తన పొలంలో పసుపు,పత్తి, వరి,పండ్లు,కూరగాయలు సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నాడని,సేంద్రీయ పదార్థాలతోనే భూ సారాన్ని పెంచుకుందామని రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, వ్యవసాయ అధికారి కవిత, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, ప్రకృతి వ్యవసాయ ప్రచారక్ శ్రీకాంత్ (జమ్మికుంట), క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభల కరపత్రం విడుదల



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రంగారెడ్డి 26వ తేదీన కందుకూరులో జిల్లా 3వ మహాసభలు జరగనున్నాయి. మహాసభల సందర్భాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు గురువారం ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే చేతులమీదుగా మహాసభల కరపత్రాన్ని విడుదల చేయించారు. జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం మైలార్దేవ్పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మహాసభల కరపత్రం విడుదల చేయించారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జేఎఫ్ నేషనల్ కమిటీ సభ్యులు బి. దేవేందర్,డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అలమనేటి గోపాల్,ఇలిటం బుచ్చన్న ,ఉపాధ్యక్షులు ఇలిటం ప్రభాకర్,మాజీ అధ్యక్షులు కలాల్ సుదర్శన్, సలహాదారు కోళ్ల యాదయ్య, ప్రచార కార్యదర్శి ఆర్ . జ్ఞానేశ్వర్, సహాయ కార్యదర్శులు పి. యాదగిరి, మద్దూరు శ్రీనివాస్, సతీష్ బాబు, ఎం. శ్రీనివాస్, పి. విక్రమ్ కుమార్, విజయ్, సుధీర్ కుమార్, అనిల్ కూమార్, పి . శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ జి తదితరులు పాల్గొన్నారు.

## భాజపా నాయకుడిని పరామర్శించిన

# భాజపా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి



**ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్)** మండల కేంద్రానికి చెందిన భాజపా నాయకులు దీటి నర్సయ్య అస్వస్థతకు గురై శస్త్ర చికిత్స ఎల్లారెడ్డిపేటలోని అశ్విని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నందుకు భాజపా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పరామర్శించారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, పట్టణ అధ్యక్షులు గంట బాలకృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యకర భోజనానికి 'సంప్రద' చిరునామా - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## - గచ్చిబౌలిలో 'సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్' ప్రారంభం





**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** ఆరోగ్యకర భోజనానికి 'సంప్రద' చిరునామాగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. గచ్చిబౌలిలోని వినాయక నగర్లో ఏర్పాటు చేసిన 'సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్'ను చేవెళ్ళ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ తిరుపతిలో ప్రారంభమైన ఈ సంప్రద ప్రయాణం.. ఇప్పుడు అనేక నగరాల్లో శాఖలతో విస్తరించిందన్నారు. హైదరాబాద్‌లో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రుచికరమైన శాకాహార, మాంసాహార వంటకాలకు ఎంతో పేరు పొందిందన్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో కూడా మంచి పేరు సంపాదించిందన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రుచికరమైన, పోషకాహార భోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ళ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న యువత బర్గర్లు, పిజ్జాలు వంటి ఫాస్ట్‌ఫుడ్స్‌ను ఆస్వాదిస్తున్నారన్నారు. నెమ్మదిగా శరీరానికి హాని చేసే పదార్థాలు ఇవన్నారు. అందుకే మన సంప్రదాయ రుచుల ఆధారంగా.. ఆరోగ్యానికి మేలు చేసే ఆహార ఎంపికలు రావడం ఎంతో స్వాగతించదగిన విషయం అన్నారు. ఈ రెస్టారెంట్ ఆహారాన్ని రుచి చూశానన్నారు. నిజంగా ఎంతో రుచిగా ఉన్నాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో పిజ్జాలు, బర్గర్లు మానేశానన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకుంటున్నానని చెప్పారు. ఆహారపు అలవాట్లు మార్చుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ డైరెక్టర్ నాగ భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, ఇతర ప్రాంతాల్లో మా వంటకాల రుచితో ప్రజల హృదయాలను గెలుచుకున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రజలకు మా రుచులు అందించాలని ఆశపడుతున్నామని చెప్పారు. సంప్రదలో మన అమ్మమ్మ ఎంతో ప్రేమగా వండినట్టు ఉండే సంప్రదాయ తెలుగు వంటకాలను వడ్డిస్తున్నామని తెలిపారు. మీరు ఎప్పుడూ ఇష్టపడే రుచి ఇప్పుడు అదే ఆత్మీయ అనుభవం హైదరాబాద్‌లోనూ లభిస్తుందన్నారు. ఈ రెస్టారెంట్ 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. నాలుగో అంతస్తులో 220 సీట్ల సామర్థ్యంతో కలదన్నారు. కాంటినెంటల్, చైనీస్ వంటకాలతో పాటు నెల్లూరు చేపల పులుసు, భీమవరం రొయ్యల వేపుడు వంటి దక్షిణ భారతీయ సంప్రదాయ వంటకాలను ప్రతిబింబించేలా దీనిని రూపొందించామన్నారు. స్నేహితులతో గడపడానికి, అర్ధరాత్రి ఆకలి తీర్చుకోవడానికి, వీకెండ్‌లో ప్రత్యేకంగా తినడానికి ఇది సరైన స్థలం అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి జీహెచ్ఎంసీ కార్పొరేటర్ వీ గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, గౌరవ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పసునూరి నరేంద్ర, సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ డైరెక్టర్ దయాకర్ బాబు సింగం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై సేవలు,దరికి చేరె రోగాలు,తస్మాత్ జాగ్రత్త:హెగ్డే

**- మహానగరంలో నిత్యం పోరాడుతూ జనాలకు సేవలు అందిస్తున్న పోలీసన్న**

**- విధి నిర్వహణలో ప్రజలను గమ్యం చేరుస్తూ, ట్రాఫిక్ సిబ్బంది మాత్రం మంచాన పడుతున్నారు**

**- పయ్య పరుగులు పెట్టాలంటే తెల్ల ఖాకీ సేవలు వర్ణనాతీతం,నల్ల కాలుష్యం మింగుతూ చౌరస్తాలో డ్యూటీతో కరిగిపోతున్న ఖాకీ ఆయుష్షు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి సిటిజన్లు సెల్యూట్ చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయించే సూర్యుడిలా దగ దగ మెరిసిపోయే ట్రాఫిక్ అధికారులు,విధులు పూర్తి అయిన తర్వాత వారిలో ఉదయం ఉన్న ఉత్సాహం ఇంటికి వెళ్లేసరికి ఆవిరి అయిపోతుంది. భాగ్యనగరంలో ప్రతి వాహనదారులు ఇంటికి సురక్షితంగా చేరుకోవాలంటే చౌరస్తాలో సేవలందించే ప్రతి ట్రాఫిక్ పోలీస్ గొప్పతనమే. ప్రస్తుతం ట్రాఫిక్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది "శివుడి గరళంలో విషం"దాగి నట్లు, రోడ్లపై సేవలందిస్తున్న ట్రాఫిక్ అధికారులు శరీరంలో ప్రతి అణువు కాలుష్యంతో (విషవాయువు) నిండిపోతుంది అనడానికి అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో నిన్న సికింద్రాబాద్ ఉత్తర మండలం తిరుమల గిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయితే ప్రతినిత్యం ట్రాఫిక్ లో తలమునకలై కాలుష్య ప్రభావానికి గురయ్యే ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి,వారి కుటుంబాలకు తిరుమలగిరి సిటీ న్యూరో సెంటర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పై హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే హర్షం వ్యక్తం చేశారు. సిటీ న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే,ఉత్తర మండల ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు,ట్రాఫిక్ సిబ్బంది హాజరయ్యారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కార్డియాలజీ,న్యూరో, ఆర్థోపెడిక్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ ప్రభావానికి గురై అనారోగ్యాల బారిన పడకుండా వారికి ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. రహదారుల పై వాయు కాలుష్యంతో పాటు గంటల తరబడి నిలబడి మానసిక ఒత్తిడికి గురయ్యే ట్రాఫిక్ సిబ్బందికి భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు స్క్రీనింగ్ దోహదపడుతుందని హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల గిరి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మధు బాబు,జానకి రాం బేగంపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్,యుగేంధర్ ఎస్సై, హర్షవర్ధన్ సిటీ న్యూరో సెంటర్ కార్డియాలజిస్టు,సిబ్బంది పాల్గొన్నారు.

# కొన్నేళ్ల సమస్యలు,కన్నీళ్లు పెట్టించాయి:ఎమ్మెల్యే శ్రీ గణేష్

## - ఎన్నో ఏళ్ళుగా పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో మోండా డివిజన్ వెస్ట్ మారేడ్ పల్లి ఎల్.శంకర్ నగర్ లో 40 లక్షల 50 వేల రూపాయలతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు నిర్మాణం,మారేడ్ పల్లి శ్మశాన వాటికలో 8 లక్షల 50 వేల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఫెన్సింగ్ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,మోండా డివిజన్ భాజపా కార్పొరేటర్ కొంతం దీపిక నిన్న గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు 10 ఏళ్లుగా కాలనీలా బస్తీల సమస్యలను పట్టించుకోకపోవడంతో వల్ల సమస్యలు పేరుకుపోయాయని,నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాజకీయాలను పక్కనపెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పార్టీలకతీతంగా అందరిని కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నానని,సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపించి నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్న విషయం ఆయన గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా సహకరిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. అదిగాక మోండా డివిజన్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను దశల వారీగా ఎమ్మెల్యే శ్రీగణేష్ పరిష్కరించడంతో కాలనీ,బస్తీ వాసులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలపడంతో మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన నేను అభివృద్ధి చేయడాన్ని నా బాధ్యతగా స్వీకరిస్తానని మరో సారి అందరితో ఆయన పంచుకున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్,సంతోష్ యాదవ్,అరవింద్యాదవ్,నందికంటి రవి,ధనలక్ష్మి ,వరలక్ష్మి, శేఖర్ ముదిరాజ్,బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### కాలనీలను అభివృద్ధి చేసే బాధ్యత నాది...

కాలనీల పర్యటనలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్. గురువారం వార్డు 7పరిధిలోని ఐఓబి కాలనీ,రవి కాలనీ, బంజారా కాలనీలను కాలనీ వాసులతో కలసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలవాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ముఖ్యంగా అంతర్గత రహదారుల వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అందుకని వాటిని యుద్ధప్రాతిపదికన కొత్త రోడ్లు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కాలనీలో ఖాళీగా ఉన్న పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి అందులో సామాజిక భవనం నిర్మిస్తే కాలనీ వాసులకు ప్రయోజనకరంగా ఉంటుందని కాలనీల వాసులు వారి అభిప్రాయాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పలుకిలనీ అధ్యక్షులు కాలనీలలో ఎన్నో ఏళ్ళ నుంచి ఈ సమస్యలు ఉన్నాయని చెప్పారు. అన్ని కాలనీలను సందర్శించిన ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ మీ సమస్యలను పరిష్కారం చేసే బాధ్యత నేను తీసుకుంటానని,కాలనీల వాసులు కూడా కలసికట్టుగా తమకేం కావాలో కూర్చుని చర్చించుకుని నా దృష్టికి తీసుకువస్తే,కంటోన్మెంట్ బోర్డు సీఈఓతో భేటీ అయ్యి స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నన్ను ఆశీర్వదించి గెలిపించిన మీకు సేవ చేయడమే భాగ్యంగా భావిస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగినేని సరిత,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# హిందీ భాష బలోపేత సమావేశంలో ఉపాధ్యాయులు

**ఇందల్వాయి (ప్రశ్నన్యూస్)** నిజాంబాద్ జిల్లా ఇందల్వాయి మండల కేంద్రంలోని నల్లవెల్లి జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్ లో జరిగిన హిందీ భాష కాంప్లెక్స్ సమావేశం లో ఇందల్వాయి, డిచిపల్లి, జక్రాన్ పల్లి మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో హిందీ భాష అభివృద్ధి గురించి చర్చించారు. ఈనెల 5న జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పూరష్కరించు కొని సముదాయం లో సీనియర్ ఉపాధ్యులు మాధురి కాంప్లెక్స్ హెచ్ఎం. ఎ కిషన్ డిచిపల్లి, సి గంగామణి జక్రానపల్లి, జి నాగమణి ఇందల్వాయి ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిచడం జరిగింది. ఇందులో కాలే గోపాల్ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీర్ సింగ్ నాయక్ (పి అర్ టి యు) రాష్ట్ర అస్సోసియాట్ అధ్యక్షులు ప్రకాష్ పవార్ బి టి ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్, 3 మండలాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






# ట్రాన్స్‌ఫర్ అయిన చైన్‌మెన్‌ల తీరు మారదా.?

- అక్రమ నిర్మాణాల సంపాదనే చైన్ మాన్ లక్ష్యమా
- బదిలీ అయిన ఆగని చైన్ మెన్ ల మైండ్ సెట్
- టౌన్ ప్లానింగ్ ఏసిపి, టిపిఓ అధికారుల కనుసైగల్లో చైన్ మెన్ ల అక్రమ భాగోతం
- చైన్ మెన్ లను అడ్డుపెట్టుకొని వసూళ్లకు పాల్పడుతున్న డీసీలు, ఎసిపిలు

**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** మున్సిపల్ శాఖ లో అవినీతి అక్రమాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. పాలకులకు అన్నీ తెలిసే వాళ్ళ అవినీతి దందా జరుగుతోంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉన్నత అధికారులకు ప్రజాప్రతినిధులకు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి అన్న విషయం వాళ్ల కనులకు కనిపిస్తే లేదా.? కనిపిస్తున్న ఎందుకు అవినీతిని అడ్డుకుంటలేరు అన్నదే ప్రజలకు కలిగిన పెద్ద సందేహం. కెసిఆర్ ప్రభుత్వంలో తీవ్రస్థాయికి చేరిన మున్సిపల్ శాఖ అవినీతి ఇప్పటికీ కొనసాగుతానే ఉంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మున్సిపల్ శాఖ తన వద్ద ఉంచుకొని అవినీతిని ప్రక్షాళన చేస్తారని తెలంగాణ ప్రజలు ఆశపడ్డారు అందుకు విరుద్ధంగా అవినీతి 1000 రేట్లు పెరిగింది అంటే సందేహం లేదు అంటున్నారు ఇప్పుడు ప్రజలు.అక్రమ నిర్మాణాల సంపదే చైన్ మెన్ లకు వరముగా మారింది. దశాబ్దాలకు పైగా ఒకే సర్కిల్లో చైన్ మాన్ లు తిష్ట వేసుకొని కూర్చున్నారని అక్రమ నిర్మాణాల వద్ద చైన్ మెన్ ల సంపద కోట్లల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. ఇష్టానుసారంగా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న కమర్షియల్ రెసిడెన్షియల్ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని నగర ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వచ్చిన ఇప్పటివరకు కమిషనర్లు బదిలీ చేయడానికి సాహసించలేదు అయితే. ప్రస్తుత జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ చైన్ మాన్ లను బదిలీ చేసినారు. అయినా తీరు మారలేదని కొత్తగా బదిలీపై వెళ్లిన అక్కడ కూడా చైన్ మెన్ లు అక్రమ వసూళ్ల దందాలు మొదలు పెట్టారని వీరిపై విజిలెన్స్ అధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా గ్రేటర్ హైదరాబాదులో భారీ అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని జోనల్ కమిషనర్, ఉప కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసిపి, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్లు చైన్ మెన్ లు చెప్పినట్టు అధికారులు వింటున్నారని ఏసీ గదుల్లో కూర్చుని తమకు కావలసిన వాటాలు చైన్ మెన్ లు తెచ్చి ఇవ్వడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులు చేపట్టే వాటిపై శాఖ పరమైన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని చైన్ మెన్ లు చెప్పినట్టు అధికారులు వింటున్నారని సికింద్రాబాద్, బేగంపేట, కూకట్ పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, అంబర్ పేట, మలక్ పెట్, ఓల్డ్ సిటీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల్లో చైన్ మెన్ ల పాత్ర కీలకమైనదని అక్రమ నిర్మాణాల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని జోనల్ కమిషనర్లకు ఫిర్యాదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదని అధికారులకు చైన్ మెన్ లకు ఉన్న సత్సంబంధాలతో అక్రమ నిర్మాణాల వద్ద భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన విజిలెన్స్ అధికారులు సర్కిల్లో జరిగే అక్రమ నిర్మాణాలపై విచారణ చేపడితే అక్రమ నిర్మాణాల వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్ల బాగోతం బయటపడుతుందని జిహెచ్ఎంసి ఆదాయానికి టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా గండి కొడుతూ తమ జేబుల్లో అక్రమ సంపాదన వేసుకుంటున్నారని అధికారులకు వత్తాసు పలుకుతున్న చైన్ మెన్ లపై విచారణ చేపడితే టౌన్ ప్లానింగ్ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయని, ప్రభుత్వం ఇచ్చే జీతాలకు వెయ్యి శాతం అక్రమ నిర్మాణాల వద్ద వసూలు చేసిన అక్రమ సంపాదన టౌన్ ప్లానింగ్ అధికారులకు, సిబ్బందికి వరంగా మారింది.

కొంతమంది అధికారులు ఒకే దగ్గర బదిలీలు కాకుండా తిష్ట వేసుకుని కూర్చున్నారని డిప్యూటీ కమిషనర్లు, ఏసీపిలు, సెక్షన్ ఆఫీసర్ల పై కఠిన చర్యలు చేపడితే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని నగర ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచిస్తున్నారు.

# పాదచారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన చెత్త

- రోడ్డుపై చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోరా.? - చెత్త వేసే ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయండి
- కాలనీలా లేక చెత్త కుప్పల నివాసాల - జనవాసాల మధ్య చెత్తను తొలగించడంలో శానిటేషన్ విభాగం పూర్తిగా విఫలం
- పారిశుద్ధ్యాన్ని పక్కన పెట్టిన జిహెచ్ఎంసి అధికారులు





**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పారిశుద్ధ్యం పూర్తిగా విఫలం అయిపోయింది. మెడికల్ అధికారులు పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. దానిని పర్యవేక్షించవలసిన డిప్యూటీ కమిషనర్లు కేవలం ఫోటోలకు ఫోజులిచ్చి చోద్యం చూస్తున్నారు. చెత్తని తొలగించడంలో ఒక్క అధికారికి కూడా చిత్తశుద్ధి లేకపోవడంతో నగర వ్యాప్తంగా రోగాలు వ్యాపిస్తున్నాయి. ఇక ప్రజాప్రతినిధులమంటూ ఫోజులు కొట్టే కార్పొరేటర్లు పత్తా లేకుండా పోయారు. చెత్తను తొలగించాలన్న చిత్తశుద్ధి ఇటు పాలకులకు అటు మున్సిపల్ అధికారులకు లేకపోవడం ప్రజల కు శాపంగా మారింది.హబ్సిగూడ డివిజన్ శ్రీనివాసపురం ప్రాంతంలో రోడ్డు పై చెత్త వేయడంతో ఆ ప్రాంతంలో చెత్తా చెదారం గా రోడ్డు ఉంటుందని అక్కడి నుండి నడుచుకుంటూ వెళ్లాలంటే తీవ్ర దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పాదచారులకు ప్రయాణికులకు బస్సు వెళ్లే ప్రాంతం కావడంతో చెత్త రోడ్డు పై పడి ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు చెత్త వేసే వారి పై చర్యలు తీసుకోవాలని చెత్త వేసే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వారి పై కేసులు నమోదు చేయాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుచున్నారు. రోడ్డు పై చెత్త వేయడంతో ప్రక్కనే ప్రహరీ గోడను ఆనుకొని గోడను నిర్మిస్తున్నారని రోడ్డుపై చెత్త, ప్రహరీ గోడతో ఆ ప్రాంతం ఇరుకుగా మారిందని ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఆ ప్రహరీ గోడను వెంటనే ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. చెత్తను తొలగించడంలో జిహెచ్ఎంసి, రామ్ కి సిబ్బంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ పర్యవేక్షణ కూడా పూర్తిగా కరువు కావడంతో చెతకుప్పలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు రోడ్లపై చెత్త వేయకుండా ఇంటింటికి ఆటో ద్వారా చెత్తను సేకరించిన కొంతమంది తెలివి లేని దద్దమ్మలు చదువుకున్న మూరు?లు రోడ్డుపై చెత్తని వేసి కాలనీలను చెత్త కాలనీలుగా తయారు చేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రగల్బాలు మాట్లాడుతారే తప్ప చెత్తను రోడ్డు పై వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించకపోవడం విడ్డూరమని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలలో చెత్తను వేయకుండా మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాలని చెత్తను రోడ్ల పై వేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారికి భారీ జరిమానాలను విధించాలని రోడ్లపై చెత్త వేసే వారిపై కేసులు నమోదు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతంలో చెత్తను వేయకుండా సిబ్బందిని ఏర్పాటు చేయాలని అదే విధంగా కెమెరాలు ఏర్పాటు చేసి కాలనీలను శుభ్రంగా ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్ ని చూడాలని అధికారులకు తెలిపిన అధికారులు మాత్రం ఇలాంటి వాటి పై శ్రద్ధ చూపించకుండా ప్రజలకు అవగాహన కల్పించకుండా కాలం గడుపుతున్నారని ఇలా అయితే కాలనీలు చెత్త కాలనీలుగా పేరు వస్తుందని చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుచున్నారు.

# వీధి కుక్కల నుండి కాపాడండి మహాప్రభో

- నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో రాక్ గార్డెన్ సమీపంలో వీధి కుక్కల బెడద
- ప్రజల ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు
- కుక్కల దాడితో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు





**శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వీధి కుక్కల బెడదను తగ్గించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజలకు విధి కుక్కల నుండి ప్రాణహాని కలుగుతుంది దానితోపాటు కొన్ని కుక్కలను నగర బయట ఉన్న గ్రామాల నుండి తీసుకువచ్చి నగరంలో వదిలి వెళుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీధి కుక్కలకు ఇంజక్షన్లు ఇచ్చి వదిలేస్తున్నామని అధికారులు ఎన్ని మాటలు చెప్పినా వాటి నుండి ప్రజలకు మాత్రం నిత్యం భయం కలుగుతూనే ఉంది ఒక్కొక్కసారి చిన్న పిల్లలపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు చాలానే ఉన్నాయి. దానికి తోడు కొంతమంది ప్రాణాలను సైతం తీసుకున్న వీధి కుక్కలపై నియంత్రణను అధికారులు నామమాత్రంగా చేస్తున్నారు. శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో రాక్ గార్డెన్ సమీపంలోని 100 ఫీట్ల రోడ్డులో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. పెద్ద గుంపులుగా తిరిగే ఈ కుక్కలు రాత్రివేళ వాహనదారులపై దాడి చేయడం, పాదచారుల పైకి రావడం స్థానికుల పార్కు సమీపంలో కి రావడానికి ప్రజలు జంకుతున్నారు.ప్రత్యేకంగా స్కూల్, కాలేజీ విద్యార్థులు ఉదయం, సాయంత్రం స్కూల్ బస్సులు, ఆటోలు ఎక్కే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లేందుకు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్న శేర్లింగంపల్లి మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసిన వాటి బెడద మాత్రం తగ్గించడంలో పూర్తిగా విఫలం చెందారని అధికారులు నిర్లక్ష్యంతోనే ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని స్థానికులు మండిపడుతున్నారు. అయినప్పటికీ శేర్లింగంపల్లి సర్కిల్ 20 జిహెచ్ఎంసి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

## ఫిర్యాదులు చేస్తున్నా వినిపించుకోవడం లేదు..


వీధి కుక్కల నుండి చిన్నారులకు, వృద్ధులకు ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులను నల్లగండ్ల హుడా కాలనీ వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జిల్లా హాస్పిటల్స్ రెగ్యులేటరీ అథారిటీ ఛైర్పర్సన్ జిల్లా కలెక్టర్ ను కలిసిన సంజయ్ రెడ్డి



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా కలెక్టర్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ (జిల్లా హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్, రెగ్యులేటరీ అథారిటీ) ఛైర్పర్సన్ బి సత్య ప్రసాద్ ఐ ఏ ఎస్ ను జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ కౌన్సిల్ మెంబర్ సంజయ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ తో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ (జిల్లా హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్, రెగ్యులేటరీ అథారిటీ) 2010 గురించి చర్చించినట్టు తెలిపారు.

## నిజామాబాద్ కలెక్టర్, డిపి ఆర్ఓ లకు మానవ హక్కుల కమీషన్ నోటీసులు


TELANGANA HUMAN RIGHTS COMMISSION
"Grihakalpa", M.J. Road, Hyderabad - 500001.

OFFICIAL MEMORANDUM

H.R.C No. 1293/2025 Date : 20/08/2025

Ref 1) Petitioned Date 28-08-22 from Mr. D Laxminarayana Chary

Ref 2) ... received from The District Collector, Nizamabad Dist. at Nizamabad District, Telangana 503001.

With reference to your Petition, a report was called from The District Collector, Nizamabad Dist. at Nizamabad District, Telangana 503001 who has accordingly sent his report, a copy of which is herewith sent to enable you to file your reply/Comments, if any by 10 Nov 2025 At 11.00 AM.

This case is posted on 10-11-2025 at 11.00 AM

Assistant Registrar (Judicial)

To:
Mr. D Laxminarayana Chary
Nizamabad, Nizamabad District-503002.

NB : Kindly mention case number invariably in all other correspondence

నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ నగరంలోని సీనియర్ జర్నలిస్ట్ నమోదు చేసిన ఒక కేసు విషయంలో మానవ హక్కుల కమీషన్ నిజామాబాద్ కలెక్టర్ డిపి ఆర్ఓ లకు నోటీసులు జారీ చేసింది. నగరంలోని గంగస్థాన్ కు చెందిన డి. ఎల్. యన్. చారి. పై,డీపీఆర్ ఓ, నిరధారమైన ఆరోపణలు చేసినందుకు మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించాడు.అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మాంతు ఎలాంటి ఆధారాలు లేకున్న తనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.కలెక్టర్ ను సైతం తప్పుదోవ పట్టించారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ద
లోకాయుక్తాతో పాటు మానవ హక్కుల కమిషన్ లో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది ఈ కేసులో లోకాయుక్తా సంబంధిత డి పి ఆర్ ఓ కు తాఖీదులు జారీ చేసింది. తాజాగా మానవ హక్కుల కమిషన్ కలెక్టర్,డి పి ఆర్ ఓ కు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో సీరియస్ గా తీసుకుని నిజామాబాద్ డి పి ఆర్ ఓ కి తాఖీదులు జారీ చేసింది. నోటీసులకు స్పందించకపోతే తామే యాక్షన్ తీసుకుంటామని పేర్కొంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అధికారుల తీరుపై మానవ హక్కుల కమిషన్ సీరియస్ గా ఉండటంతో అధికారులపై చర్యలు ఉంటాయా అనే చర్చ జరగుతుంది.
నిజామాబాదు జిల్లా నుండి గడల అనిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

## కుస్తీ పోటీలో అనిత కనబరచిన అత్యుత్తమ ప్రతిభ

- రాష్టస్థాయి నుండి జాతీయస్థాయి వరకు అనిత క్రీడా ప్రయాణం
- జిల్లా ప్రజల హర్షం - అభినందనలు



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని జాగిర్యాల గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు గడల అనిత హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల సెప్టెంబర్ 9, 10 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆల్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ 2025 -26 టోర్నమెంట్స్‌లో రెస్లింగ్ (కుస్తీ/మల్లయుద్ధం) విభాగంలో నిజామాబాదు జిల్లా నుండి గడల అనిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో అనితకు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు,పలువురు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588